బయట వర్షం కురుస్తోంది. కిటికీలోంచి మెరుపులు కనబడుతున్నాయి. అప్పుడప్పుడు ఉరిమిన శబ్దం వినిపిస్తోంది. తెర లేచేసరికి— కిటికీ వైపే, అంటే వెనక్కి తిరిగి కూర్చుని ఉన్నాడు రవి. వయసు ముప్పై నలభై మధ్య. పక్కనే చిన్న టేబిల్‌మీద ఉన్న ట్రాన్సిస్టర్‌లోనుంచి వస్తూన్న సితార్ ధ్వనిని ఉరుములు 'సూపర్‌సీడ్' చేస్తున్నాయి. చెయ్యి పక్కకి సాచి వాల్యూమ్ ఎక్కువ చేశాడు. ఇప్పుడు సితార్ బాగా వినిపిస్తోంది. సిగరెట్ వెలిగించాడు.

సితార్ ఆగిపోయింది. పోలీస్‌కమిషనర్ ప్రకటన వస్తోంది— "భీమరాజు అనే దొంగని సజీవంగానైనా, శవంగానైనా అప్పగిస్తే పది వేలు బహుమానం"— అని. ఇంగ్లీషులో వస్తూన్న ఆ ప్రకటన పూర్తికాకుండానే బయట తలుపు కొట్టిన చప్పుడు వినిపించింది. రవి ట్రాన్సిస్టర్ కట్టేస్తూ, కుర్చీలోనుంచి లేవకుండానే — "తలుపు తీసే ఉంది. రావచ్చు" అన్నాడు.

కంబళి కప్పుకొని ఇప్పుడు లోపలికి వచ్చిన వ్యక్తి భీమరాజు. అతను లోపలికి రాగానే ఆ గాలివిసురుకి తెరలు బలంగా కదిలాయి. ఉరిమింది. లోపలికి వచ్చి తలుపు దగ్గిరగా వేశాడు. కంబళి మూలగా వదిలేశాడు. బట్టలు కొద్దిగా తడిసినాయి.

భీమరాజు: బయట వర్షం ఎక్కువగా ఉంది. తగ్గగానే వెళ్ళిపోతాను. మీరు క్షమిస్తే . . .అంతవరకూ. . . (మాటల్లో సంస్కారం కనబడుతూంది.)

రవి: (వెనక్కి తిరిగాడు. మొహమంతా కాలిపోయి ఉంది. భయం కొలిపేటంత వికారంగా ఉంది.) దానికేముంది? ఇలా వచ్చి కూర్చోండి. ఇంత చిన్న విషయానికి ఇంతగా అడగాలా? (పక్కనే ఉన్న తువ్వాలు తీసి ఇచ్చాడు.)

భీ: థాంక్స్. (అందుకున్నాడు.) తుఫానులా ఉంది.

ర: అవును, తుఫానే.

భీ: (మొహం తుడుచుకొని తువ్వాలు సోఫామీద వేశాడు.) బాగా చలిగా ఉంది కదూ?

ర: సిగరెట్ కాలుస్తారా? (ఇచ్చాడు).

భీ: థాంక్స్. (రవి వెలిగించాడు.) నా పేరు రాజు. మీర్లు. . .

ర: ఆట్మాంజీలో ప్రొఫెసర్ని. పేరు రవి. (షేక్‌హేండ్ ఇచ్చాడు.)

భీ: నైస్ టు సీయూ. ఊరుకి ఇంత చివర్లో ఉన్నారేం?

ర: నాకు సిటీ ఆట్మాస్‌ఫియర్ అంటే అంత ఇష్టం ఉండదు. ఆఁ ఇంతకీ మీరేం చేస్తూ ఉంటారో చెప్పారు కాదు. . .

(అంతలో తలుపులు కొట్టుకొన్నాయి. మాట ఆపేశాడు.)

భీ: తలుపులు తీసే ఉంచారు. మీకు భయం లేదా?

ర: భయమా? భయం ఎందుకు? (తలుపు వేశాడు.)

భీ: ఎవరన్నా లోపలికి వచ్చి బెదిరిస్తే? అంతా దోచేసుకొంటే. . .

ర: (నవ్వి) దోచుకొందామని వచ్చిన దొంగకి వేసిన తలుపులు అడ్డం వస్తాయా? (తలుపులు బద్దలు కొడితే మాత్రం ఈ తుఫానులో నాకు సాయం వచ్చేది ఎవరు?

భీ: అదీ నిజమేననుకోండి.

ర: ఇంతకీ మీరు ఏం చేస్తూ ఉంటారో చెప్పారు కాదు. . .

భీ: భయపడతారేమో?

ర: భయంమీద నా అభిప్రాయం ముందే చెప్పానుగా? జీవితంమీదా డబ్బు మీదా ఆశ ఉన్నవాడే భయపడతాడు. నాకా రెండూ లేవు. ఇంకెందుకు భయం?

భీ: జీవితంమీద ఆశ ఎందుకు లేదు మీకు?

ర: చిన్నప్పటినుంచీ నా అనేవాళ్ళు లేరు. (సాలోచనగా అన్నాడు). తమ చుట్టూ గూడు కట్టుకొని అందులోనే బ్రతుకేవాళ్ళు ఏ మాత్రం ఆధారం దొరికినా అల్లుకుపోదామని చూస్తూ ఉంటారు. (ఆగాడు) భవిష్యత్తుమీద ఆశలు పెంచుకొన్నాను. పెళ్ళయింది. వర్తమానం వెక్కిరించింది.

భీ: నా కేం అర్థం కావటం లేదు.

ర: అదే మంచిది లెండి.

భీ: అంటే— ఒంటరితనం వల్ల చచ్చిపోవలసినంత నిరాశ తెచ్చుకోవలసిన పని లేదే! డబ్బు పారేసి కావలసినంత సుఖం కొని తెచ్చుకోవచ్చుగా?

ర: ఆత్మీయతకికూడా వెల ఉంటుందని మీ నోటి వెంబడే వింటున్నాను. . . పోనిలెండి. అనవసర ప్రసంగం. మీ గురించి చెప్పండి.

భీ: వర్షం వెలిసిన వెంటనే వెళ్ళిపోయేవాణ్ణి— నా గురించి తెలుసుకోవటం ఎందుకు లెండి!

ర: అల్లా అంటారేం? ఈ ప్రపంచాన్నే ఒక రైల్వే కంపార్ట్‌మెంట్‌తో పోల్చారొకకవి. ఎక్కి, దిగే మనుషుల మధ్య ఈ స్వల్ప కాలంలోనే మమతలూ అనుబంధాలూ. అటువంటప్పుడు నాతో, నా ఇంట్లో కొంచెం సేపు గడపబోతున్నారు. మీ గురించి ఏమీ తెలుసుకోకుండా ఎలా?

భీ: చెబితే వెళ్ళగొట్టేస్తారేమోనని భయం.

ర: వెళ్ళగొట్టటమా? ఛా! అలా ఎన్నటికీ కాదు.

భీ: అయితే వినండి. ఎవరి కోసమయితే పోలీస్ డిపార్ట్‌మెంట్ అంతా నెలబట్టి తరబడి వెతుకుతూ ఉందో, సజీవంగానైనా శవంగానైనా సరే అప్పగిస్తే పది వేలు బహుమానం అని ఎవరి కోసం ప్రభుత్వం ప్రకటిస్తోందో ఆ భీమరాజుని నేనే.

ర: ఏమిటీ! ?

భీ: (ఆగి) భయపడుతున్నారా?

ర: లేదు. ఆశ్చర్యపోతున్నాను. మీ గురించి పేపర్లో చదివాను. ఆరడుగుల ఎత్తూ, పెద్ద పెద్ద మీసాలూ, మీ గురించి అంతర్గతంగా ఇంకోలా ఊహించుకొన్నాను. అందుకని ఈ వాస్తవాన్ని తట్టుకోవటానికి కొంచెం సేపు పట్టింది. అంతే. కానీ, నా అనుమానం మాత్రం తీరలేదు. మిమ్మల్ని చూస్తే చదువుకొన్నవారిలా కనిపిస్తున్నారు.

భీ: (నవ్వి) అంటే మీ ఉద్దేశ్యం దొంగలు చదువుకోరనా? లేకపోతే చదువుకున్న వాడెవ్వడూ దొంగ అవడనా?

ర: అబ్బే! చదువుకొంటే దొంగతనం చేయవలసినంత అగత్యం ఏముందని?

భీ: అగత్యం! (శుష్కంగా నవ్వాడు) అగత్యం కాక మరేమిటి? (ఆగాడు.) ఏదో సినిమా చూడటానికి, రహస్యంగా పేక ఆడటానికీ నేను దొంగతనం చేయలేదండీ. . . కుక్కి మంచంలో పడుకొని తనకి మందులు తెచ్చానేమోనని ఆశగా చూసే తల్లీ, ఎప్పుడూ కదలని మూలనున్న గిన్నెల్ని నిస్సహాయంగా చూస్తూ పెదాలు తడుపుకొనే చెల్లాయీ— వీళ్ళ కోసం మొట్టమొదటిసారి దొంగతనం చేశాను. అప్పుడే అర్థమైంది నాకో విషయం— మనిషి బ్రతకటానికీ, మనిషి ఆనందానికీ కావలసింది డబ్బు. ఎలా సంపాదించినా సరే దానికి విలువ ఉంటుంది. (క్షణం ఆగాడు.)

ర: (దగ్గిరగా వచ్చి) ఒక్క విషయం చెప్పండి. మీరు చేస్తున్న పని తప్పని మీకెప్పుడూ అనిపించలేదా?

భీ: మొదట్లో అనిపించేది. (ఆగి) కానీ, అనుభవాలు వేసిన ముసుగులు మానవత్వాన్ని పరదాల వెనుక దాచాయి.

ర: మీ కథ చిత్రంగా ఉందే. . . తరవాత ఏమయింది?

భీ: (నవ్వి) ఏముందీ—పని శ్రద్ధగా చేశాను. ప్రమోషన్ వచ్చింది. ప్రస్తుతం రేటు పది వేలు.

(బయట తలుపు కొట్టిన చప్పుడు. భీమరాజు తలుపు తీశాడు. చేతిలో రెయిన్ కోట్‌తో సుధాకర్ లోపలికి వచ్చాడు.)

సుధాకర్: మే ఐ కమిన్?

ర: ఆ విషయం లోపలికి వచ్చి అడుగుతారేమిటి?

సు: ఓహ్. . . సారీ! బై దిబై మీలో హోస్ట్ ఎవరు? ఒక హేంగరుంటే ఇవ్వండి.

ర: సారీ, .. హేంగరూ. . .

సు: దట్సాల్‌రైట్. (కంబళి పక్కగా రైన్‌కోట్ పారేశాడు.) వర్షం తగ్గగానే వెళ్ళిపోతాను.నా పేరు. . .

ర: ఒక్క నిమిషం ఈ లోగా కొంచెం కాఫీ ప్రిపేర్ చేస్తాను ముగ్గురికీ. (లోపలికి వెళ్ళాడు.)

సు. ఈ చలిలో కాఫీ ఏమిటండీ—

భీ: (నవ్వి) మరేం కావాలి?

సు: రెండు పెగ్గులు మళ్ళీ, బుగ్గన ఖారాకిళ్ళీ, ఆ పైన కాంచనవల్లి.

భీ: అవన్నీ ఇప్పుడెక్కడ దొరుకుతాయండీ— ఈ ఊరి చివర!

సు: నిజమే. ఇది నిజంగా నరకమే అనుకోండి. వెధవవర్షం—అకస్మాత్తుగా వచ్చేసింది. ఈ బ్లడీ ఇండియా అంటే నా కందుకే ఇష్టం ఉండదండీ.

భీ: నిజమేనమ్మండీ. ఈ బ్లడీ ఇండియాలో వెధవవర్షాలు అకస్మాత్తుగా వస్తూ ఉంటాయి.

సు: (గతుక్కుమని) అబ్బే. . . ఐ మీన్. . . కొద్దిగా వర్షం వస్తే చాలు. కారుని ఒక్కడుగు ముందు కెళ్ళనియ్యవు ఈ రోడ్లు. ఇదే అమెరికా అయితేనా— నియాన్‌లైట్ల కాంతిలో తడిచి మెరుస్తూన్న రోడ్లమీద పాములా జారిపోయేది కారు. ఆ థ్రిల్లే వేరులెండి.

# నిజం



—యండమూరి వీరేంద్రనాథ్

భీ: మీరు అమెరికా వెళ్ళారా?

సు: మా అంకుల్ వెళ్ళాడు. ఏం, అలా అడుగుతున్నారు?

భీ: ఏమీ లేదు. ఊరికినే.

(రవి వచ్చాడు లోపలనుంచి.)

ర: అయిదు నిమిషాలలో తయారవుతుంది కాఫీ. (ఆగి, సుధాకర్ వైపు తిరిగి) అన్నట్టు మీ పేరు సుధాకర్ కదూ?

సు: కరెక్ట్. ఎలా చెప్పగలిగారు? మీరుగానీ మా ఫాక్టరీలో పనిచేస్తున్నారా?

ర: లేదు. కాలేజీలో మీ కన్నా ఒక సంవత్సరం సీనియర్ని నేను.

సు: ఎస్! నేను కాలేజీలో చేరిన మొదట్లోనే నా పేరు సీనియర్స్‌కికూడా తెలిసిపోయిందిలెండి. (భీమరాజు వైపు తిరిగి) ఇంతకీ మీ పేరు చెప్పారు కాదు?

భీ: భీమరాజు.

సు: కొంపతీసి గజదొంగ భీమరాజు కానీ కాదు కదా! పట్టుకుంటే పదివేలట. రేడియోలో చెపుతున్నారు.

ర: మీరు పట్టుకొందామనా?

సు: ఏం? అంత ధైర్యం నాకు లేదనుకొన్నారా? (జేబులోంచి రివాల్వర్ తీశాడు). ఇదిగో, ఇది సాయం ఉన్నంతవరకూ మనకేం ఫర్వాలేదు.

భీ: అదేమిటి?

సు: దీన్ని రివాల్వర్ అంటారు.

భీ: (నవ్వి) ఆ విషయం తెలియక కాదు. నే నడిగేది— దాన్ని జేబులో పెట్టుకొని తిరగటం ఎందుకని?

సు: (గర్వంగా) మల్టీ మిలియనీర్ జగన్నాథం కొడుకు రివాల్వర్ లేకుండా బయట తిరగడు.

ర: అంతమంది శత్రువులు కాబోలు.

భీ: దాన్ని లోపల పెట్టెయ్యండి.

సు: భయపడకండి. పెట్టేస్తాను. భీమరాజు వనక్కి వస్తే తీశానంతే. పెట్టేశాను.) (బయట ఉరుముతూంది.)

సు: అబ్బా! ప్రళయం వచ్చే ముందు వర్షంలా ఉంది.

ర: అవును. ప్రళయం వస్తోంది.

సు: నా కారు బయటే ఉండిపోయిందే?

భీ: లోపలికి తీసుకు వచ్చేద్దామంటారా?

సు: అబ్బే, అదికాదు నా ఉద్దేశ్యం. కారు బయటుంటే. . .

ర: ఇప్పుడు మీ రేం చేస్తున్నారు?

సు: నేనా— ఇప్పుడేం చెయ్యటం లేదండీ. చదువు పూర్తయి నాలుగు సంవత్సరాలే కదండీ. అవుతా?

భీ: ప్రస్తుతం రెస్టు తీసుకొంటున్నట్టున్నారు.

సు: ఎగ్జాక్ట్‌లీ.

ర: ఇలా ఊరి చివరికి వచ్చారేం?

సు: ఓ ఫ్రెండ్ టి. బి. లో పార్టీ ఇచ్చాడు. టైమ్ తెలియలేదు. బయలుదేరేటప్పటికె వర్షం మొదలైంది. ఇక్కడి కొచ్చేసరికి కారు కదల్నని మొరాయించేసింది. నాకు రిపేర్ చెయ్యటం చేతకాదు. మీ ఇల్లు కనబడింది. లోపలి కొచ్చేశాను.

భీ: ఇంతే సంగతులు.

సు: మాటలు భలే వదులుతారే మీరు. మీకు పెళ్ళయిందా, గురూగారూ?

ర: అంటే పెళ్ళయిన మొగాళ్ళు మాట్లాడలేరనా మీ ఉద్దేశ్యం?

సు: అబ్బే— ఐ మీన్. . .

భీ: నాకు పెళ్ళవలేదు. మీకు?

సు: నాకా? ఇద్దరు పిల్లలుకూడా. ఒన్ ఆడమ్. ఒన్ ఈవ్.

భీ: (కిటికీలోంచి బయటకు చూసి) వర్షం తగ్గిందిగా? తాళా లివ్వండి. మీ కారు నేనేమన్నా బాగుచెయ్యగలనేమో చూస్తాను.

సు: థాంక్స్, గురూగారూ. (తాళా లిచ్చాడు. భీమరాజు వెళ్ళిపోయాడు.) ఈయన్ని ఎక్కడో చూసేను. ఎంత ఆలోచించినా జ్ఞాపకం రావటం లేదు. ఎప్పుడూ? . . . కాలేజీ లైఫ్‌లోనా?

ర: కాలేజీ అంటే జ్ఞాపకం వచ్చింది. మీకు గుర్తుందా? మనం కాలేజీలో చదువుకొనే రోజుల్లో మీ క్లాస్‌మేట్ కమల. . .

సు: కమలా?. . . కమలెవరు?

ర: అదేమిటండీ? మీరు హృదయపూర్వకంగా ప్రేమించిన కమల. . .

సు: కమల!. . . ఎస్. కమల! జ్ఞాపకం వచ్చింది. అవునూ, ఎక్కడుంది ఆమె ఇప్పుడు?

ర: అదేమిటి— మీకు తెలియదా?

సు: లేదండీ. కాలేజీ విడిచిపెట్టిన తరవాత కలుసుకోనేలేదు.

ర: మరి ఆ రోజుల్లో మీది అమరప్రేమ అని, దాన్నెవరూ విడదీయలేరనీ అనుకొనేవారు.

సు: ఔను. ఆ రోజుల్లో. . . అబ్బా— జ్ఞాపకం చెయ్యకండి మాస్టారూ. . . ఆ రోజులు మళ్ళీ రావు.

ర: మరి మీరు కమల్ని పెళ్ళి చేసుకోలేదేం?

సు: కమల్నా? పెళ్ళా?

ర: అవును. మరి అంతగా ప్రేమించినవాళ్ళు.

సు: ఓ. . . నో! ప్రేమ వేరూ, పెళ్ళి వేరూ. ఆఁ—ఇంతకీ ఆమె ఎక్కడుందో మీకు తెలుసా?

ర: ఉహూఁ తెలియదు. (ఆగి) కానీ, ఆమె పెళ్ళి చేసుకోలేదనీ, ఎప్పుడో మీరు ఆమెని కలుసుకొంటారని ఎదురు చూస్తూందనీ మాత్రం తెలుసు. ఎప్పుడూ మీ ఫోటోనే చూస్తూ రాత్రింబవళ్ళు గడిపేస్తూ ఉంటుందని విన్నానుకూడా.

సు: రియల్లీ? ఓహ్. ఈ సుధాకరం కోసం ఇంతగా ఎదురుచూసే అమ్మాయిలు కూడా ఉన్నారని నా కిప్పుడే తెలిసింది. అయినా ఆమె అడ్రెసు మీకు తెలియకపోవటం నా దురదృష్టం.

ర: తెలుస్తే?

సు: తెలుస్తేగా? నా కోసం ఇంతగా వేచి చూస్తున్న కమల్ని ఆ మమేఘాల మీద వెళ్ళి కలుసుకొని రానూ?

ర: ఎందుకు కలుసుకోవటం? మీకు పెళ్ళయి పోయిందిగా!

సు: అదేమిటండీ? దేని దారి దానిదే. (ఆగి) మీకు తెలియదు కానీ మాస్టారూ— ఆ రోజుల్లో మా ప్రేమ. . . ఆమె హీరో—నేను రాంయూ, ఆమె లైలా— నేను మజ్నూ— ఆమె దేవతా— నేను పా. . .

ర: ఆగండాగండి. కమల జ్ఞాపకం వచ్చేసరికి ఇన్‌స్పైర్ అయిపోతున్నారు.

సు: మా ప్రేమలోనే ఉందండీ ఆ ఇన్స్‌పిరేషను. ఏదో అదృష్టం బాగా లేక గానీ లేకపోతే చరిత్రపుటల్లో సువర్ణాక్షరాల్లో లిఖింప వలసినంత గొప్పదండీ మా ప్రేమ. ఎలాగైనా వీలైతే సంపాదించండి, సార్, అడ్రెసు.

ర: కానీ మీకు పెళ్ళయిందండి కదండీ?

సు: అబ్బా మీ రెంత చౌకబారుగా ఆలోచిస్తున్నారండీ! ప్రేమ మహత్తరమైనది. దానికి పెళ్ళిళ్ళూ అంతస్తులూ లాటి అడ్డు గోడలు లేవు. ప్రేమ భగ్నమయితేనే నండీ ప్రిల్లు. ఆమెగానీ ఇప్పుడు కనబడితేనా— నా మనో మందిరంలో ప్రతిష్ఠించుకొంటాను. ప్రేమకి అడ్డు ఇంకో లోకంలో ఏదీ లేదనీ, ఏ శక్తీ దాన్ని వేరు చేయలేదనీ చాటి చెపుతాను. ప్రేమరాహిత్యంలో బ్రతుకుతున్న ఈ మనుష్యులకు అస్తిత్వంతో హృదయాలు స్పందించే ఈ . . .

భీ: (వస్తూ) కారు బాగయింది. (తాళాలిచ్చాడు) ప్లగ్ ఒకటి పోయిందంతే.

సు: అబ్బా మూచ్ పోగొట్టేశారురాగ్. (రవి వైపు తిరిగి) ఇంతకీ మీరు ఏం చేస్తూ ఉంటారో చెప్పారు కాదు.

ర: నేను ఆట్మాలజీలో ప్రొఫెసర్ని.

సు: ఆట్మాలజీయా?

ర: అవును. ఆక్వియస్ వేపర్‌లో రీసెర్చి చేశాను.

భీ: ఇప్పుడు మీరు చేస్తున్న ప్రయోగం దేనిమీద?

సు: సీక్రెట్ కాకపోతేనే చెప్పండి.

ర: చెబుతాను. దానికేముంది. . . ఆక్సిజన్, హైడ్రోజన్ కలుస్తే నీరు తయారవుతుందని మీకు తెలుసు.

భీ: అవును. అయితే?

ర: మన చుట్టూ ఉన్న గాలిలో ఆ రెండూ ఉన్నాయి. కానీ అవి రెండూ కలిసిపోయి నీళ్ళుగా మారిపోవడం లేదు. ఎందుకంటే ఆ రెండిటి మధ్యా కెమికల్ రియాక్షన్‌కి సరిపోయే పరిస్థితులు— అంటే 'కాటలిస్ట్' లేదు.

సు: కొంప తీసి దాన్నిగానీ మీరు కనిపెట్టారేమిటి?

ర: బాగా కనుక్కొన్నారు. ఆ కాటలిస్ట్‌ని నేను కనిపెట్టాను. ఒక చిటికెడు ఆ పౌడర్ని ఈ గదిలో వెదజల్లామనుకోండి. రెండు నిమిషాల్లో ఈ గదిలో దాదాపు

పది గాలెన్ల నీరు తయారవుతుంది. అంటే— ఈ గదిలో ఉన్న ఆక్సిజన్, హైడ్రోజన్ కలిసిపోయి నీరుగా మారిపోతాయన్నమాట.

భీ: అంతేకాదు. నా ఊహ నిజమయితే ఈ గదిలో ఉన్న ముగ్గురం ఆక్సిజెన్ లేక చచ్చిపోతాం.

ర: కరెక్ట్. బాగా కనుక్కొన్నారు.

సు: మీ లాబ్ ఎక్కడుంది?

ర: ఈ ఇంటి వెనకే. చూస్తారా?

భీ: వద్దులెండి. ఈ వర్షంలో ఏం చూస్తాం!

సు: ప్రొఫెసర్— ఒక విషయం చెప్పండి. మీరు తయారుచేసిన ఆ పౌడర్ని ఎక్కువ క్వాంటిటీలో గాలిలో కలిపేస్తే ఒక దేశం మొత్తాన్ని వరదలతో ముంచెయ్యొచ్చా?

ర: చేయచ్చు. కానీ అంతకుముందే ఆక్సిజన్ లేక ఆ దేశంలో మనుష్యులు. . . ఒక మనుషులేమిటి? అన్ని జీవాలూ చచ్చిపోతాయి.

సు: అలా అయితే యుద్ధాల్లో మీ పౌడర్ చాలా బాగా ఉపయోగిస్తుందన్నమాట!

ర: (సాలోచనగా) ఇక ఈ భూమిమీద యుద్ధాలు జరిగే ప్రసక్తే లేదు, సుధాకరంగారూ.

సు: అంటే?

ర: మీకు అసలు చెప్పకూడదనుకొన్నాను. కానీ చెపితేనే మంచిదేమో అనిపిస్తోంది.

భీ: ఏమిటండీ అది?

ర: మార్స్— తెలుగులో 'కుజుడు' అంటారు. ఆగ్రహం సంగతి మీకు తెలిసే ఉంటుంది. దానిమీద ఆక్సిజెన్ లేదు. కానీ నీళ్లు మేఘాలూ ఉన్నాయి. ఇదెలా సాధ్యమో చెప్పగలరా?

భీ: బహుశా మీరు కనిపెట్టిన కాటలిస్ట్ లాటిది ఆ గ్రహంమీద ఉండచ్చు.

ర: నిజం. ఉంది. కానీ నేను కనిపెట్టిన దానికి దాదాపు వెయ్యి రెట్లు ఎక్కువ పవర్ ఉన్నది అది.

సు: అయితే—

ర: మొన్న 'బాన్' లో జరిగిన "ఇంటర్నేషనల్ సైంటిస్ట్స్ మీట్" లో ప్రొఫెసర్ స్టీవెన్స్ ఒక సంగతి డిక్లేర్ చేశాడు. అతడు చెప్పింది నిజమయితే సరిగ్గా 8—45 కి కుజుడు మూడు నిమిషాల పాటు ఈ రోజు భూమికి దగ్గరగా వస్తాడు.

భీ: దానివల్ల మనకేదైనా నష్టం ఉన్నదంటారా?

ర: లేదు. అనే అందరమూ అప్పుడనుకొన్నాం. కానీ ఈ రోజే నాకు ఒక అనుమానం వచ్చింది— ఆ కుజుడి మీద ఉన్న కాటలిస్ట్ ప్రభావం భూమిమీద పడి ఇక్కడ ఉన్న ఆక్సిజెన్ హైడ్రోజన్‌లని నీరుగా మార్చేస్తుందేమోనని.

భీ: మరి— మీ అనుమానం సంగతి అందరికీ చెప్పారా?

ర: లేదు.

భీ: ఏం?

ర: నాకే అనుమానం రెండు గంటల క్రితమే వచ్చింది. ఈ విషయం అందరికీ చెపితే, ఒకవేళ నా అనుమానం నిజం కాకపోతే అందర్లోనూ అవమానం పొందవలసి వస్తుంది. ఇక నా అనుమానం నిజమా కాదా అని తేల్చటానికీ, అంటే ఈ భూమిమీద ప్రళయం వస్తుందా రాదా అని తేల్చటానికీ ఒకే ఆధారం ఉంది.

భీ:

సు: ఏమిటది? (దూరంగా ఉరిమింది.)

ర: కుజగ్రహం భూమికి దగ్గరగా వస్తున్న కొద్దీ భూమిమీద వర్షం మొదలవుతుంది. కొంచెం సేపట్లో ఇక ఆక్సిజెన్ అనేదే ఉండదు. అంతా నీరుగా మారుతుంది. ఈ రాత్రికి వర్షం వస్తే నా అనుమానం. . .

భీ: కరెక్టయిందన్నమాట. అవునా. . .

ర: అవును. వర్షం వస్తోంది. ఇక్కడే కాదు. ప్రపంచం అంతటా వర్షం. ఎక్కడ చూసినా వర్షమే. కుంభవృష్టి కురుస్తోంది. ఇప్పుడే బి. బీ. సి. స్పెషల్ బ్రాడ్‌కాస్ట్ ఇచ్చింది.

భీ: అంటే ప్రళయం వస్తోందా?

ర: ఆ. సరిగ్గా 8—45 కి. . . ప్రళయం వస్తోంది.

సు: ఇప్పుడెలా? మన అందరం చచ్చిపోతామా? ఎవరమూ మిగలమా?

ర: తప్పదు. వృక్షజాతి మాత్రమే మిగులుతుంది— అయిదు నిమిషాల పాటూ ఆక్సిజెన్ లేకుండా అది ఉండగలుగుతుంది కాబట్టి.

అతిగా మాట్లాడేవారిని అపకారం, శత్రువులకు
మేధావులు ద్వేషిస్తారు. ఉపకారం జరుగుతుంది.
సన్నిహితులు చులకన తద్వారా వారి వినాశాన్ని
చేస్తారు, మిత్రులు ఎగతాళి వారే తెచ్చుకుంటారు.
చేస్తారు. వారివల్ల మిత్రులకు —ప్లూటార్క్

సు: ఇదంతా నేను నమ్మలేకుండా ఉన్నాను.

ర: నమ్మకపోతే నేను చేసేది ఏమి లేదు. ఈ విషయం ధ్రువపడిన అర గంటనుంచీ ఏమీ తోచటం లేదు. ఏదైనాచేసి ఈ ప్రపంచాన్ని రక్షించగలిగితే బాగుండును.

సు: ఇప్పుడెలా?. . . ఏమిటో. . . మైగాడ్. . . తల బద్దలై పోతోంది. . . నే వెళతాను. ఆఖరి సారి అందర్నీ చూసుకొంటాను. ఈ విషయం అందరికీ చెబుతాను. (వెళ్లబోయాడు)

ర: అంత పని మాత్రం చెయ్యకండి.

సు: ఏం?

ర: కొంచెం సేపట్లో చచ్చిపోవటం ఖాయమని తెలిసిన తరవాత బ్రతకటం కష్టం. ఈ అర గంట సేపూ క్షణం క్షణం ఛస్తూ బ్రతకటం కంటే ఒక్కసారే హఠాత్తుగా చావటం మంచిది. అందుకే అసలు ఈ విషయం మీకు కూడా చెప్పకూడదనుకొన్నాను ఇంత సేపూ.

భీ: మరి ఇప్పుడు మాత్రం ఎందుకు చెప్పారు? ఇంకో అర గంటసేపు మేమూ మీతో పాటూ నరకయాతన అనుభవించటానికా?

ర: (ఆగి) మన ముగ్గురి విషయమూ సంబంధించినంతవరకూ మనకేం ఫర్వా లేదు.

భీ:

సు: అంటే—

ర: ఈ అరగంట లోనూ ఈ గదిని ఆల్‌ప్రూఫ్‌గా మార్చేశాను. ఆ కాటలిస్ట్ ప్రభావం పడకుండా ఆంటీ— రేడియో— ఆక్టివ్ కవర్లతో ఈ గదిని కప్పేశాను. బయట గోడ మెరవటానికి కారణం అదే. సరిగ్గా ఆ సమయానికి ఆక్సిజెన్ సిలిండర్ విప్పి గదిని అన్ని వైపులా మూసేస్తాను.

భీ: కానీ ఆ తరవాత మాత్రం మనం బయటికి ఎలా వెళ్లగలుగుతాం?

ర: ఏ ముంది? కుజగ్రహం దూరంగా వెళ్లిపోగానే—అంటే 8—50 కి— మళ్లీ ఈ నీళ్లన్నీ ఆక్సిజెన్—హైడ్రోజన్‌లుగా మారిపోతాయి. అప్పుడు మళ్లీ మామూలే. ప్రపంచం అంతా ఇలానే ఉంటుంది. మనుష్యులూ ఇతర జీవాలూ ఉండవు.

సు: మనం ముగ్గురం మాత్రమూ మిగులుతాం.

ర: అవును. అర గంట అయిన తరవాత మనం బయటకు వెళ్లి పోవచ్చు. ఈ విశాల ప్రపంచంలోకి. . .

భీ: ఇదంతా కలేమో అనిపిస్తోంది. (ముగ్గురూ మౌనంగా ఒక క్షణం ఆలోచించారు.) పోనీ. . . మనతోపాటూ ఇంకా కొంత మందిని ఈ గదిలోకి పిలుస్తే . . .

ర: చోటు సరిపోదు.

సు: ఎంతోమంది వద్దు. ముగ్గురు! ముగ్గురంటే ముగ్గురు! మన ముగ్గురికీ. . .

ర: లాభం లేదు, సుధాకర్. ఈ గదిలో ముగ్గురికి మాత్రమే సరిపోయే ఆక్సిజెన్ ఉంటుంది.

(ఒక క్షణం నిశ్శబ్దం.)

రవి: (ట్రాన్సిస్టర్ పెట్టి కట్టేస్తూ) ఉహూ; ఏ ఫారిన్ స్టేషనూ సరిగా రావటం లేదు. పశ్చిమం వైపు దేశాల్లో అప్పుడే దీని ఎఫెక్ట్ ప్రారంభమయిందన్నమాట. (ఇద్దర్నీ చూసి) భయపడుతున్నారా?

భీ: (నవ్వి) క్షణం క్షణం ప్రాణాలు ఫణంగా పెట్టి జీవించేవాడిని— నాకు ఈ ప్రాణం గురించి భయం లేదు. నేను ఆలోచిస్తున్నది అదికాదు.

ర: మరి?

భీ: ఈ ప్రపంచం సర్వ నాశనమౌతుంది. మనం ముగ్గురం మాత్రం మిగులుతాం. హాయిగా ఈ విశాల ప్రపంచంలోకి అడుగు పెడతాం. అంతులేని సంపదలకు మనమే అధిపతులం. మనమే ఏకా చింతా ఉండదు. కానీ... కాలం గడుస్తుంది మనకీ వయసు వస్తుంది. ముసలివాళ్లం అవుతాం. ఏదో ఒకరి తరవాత

ఒకరం— ముగ్గురం చచ్చిపోతాం. దానితో ఇక ఈ ప్రపంచంలో జీవకోటి అంటూ మిగలదు. మిగిలిన గుర్తూ ఉండదు.

ర: అవును. మనం ముగ్గురమే ఈ ప్రపంచపు ఆఖరు మనుష్యులం.

భీ: ఇది ఎందువల్ల అంటే—


ను: మనం ముగ్గురం మొగవాళ్లం అవటంవల్ల!

భీ: కరెక్ట్. కానీ ఈ సమస్యకు ఒక పరిష్కారం ఉంది. ఈ గదిలో— ఎటువంటి పరిస్థితుల్లోనూ ముగ్గురికంటే ఎక్కువ మంది ఉండలేని పక్షంలో, మనలో ఒకరు ప్రాణాలు త్యాగం చేసి బయటికి వెళ్లిపోతే, అదే స్థానంలో ఒక అమ్మాయిని ఉంచగలిగితే— ఆడమ్ అండ్ ఈవ్‌లతో పునఃసృష్టి జరుగుతుంది.

ను: కానీ చూస్తూ చూస్తూ ఎవరు ప్రాణాల్ని వదులుకోగలరు?

భీ: అందరికన్నా చివరగా వచ్చినవారు మీరేగా!


పాపం యీ దంతం హత్యచేయబడింది!




మరీ దారుణంగా. కొంచెంకొంచెంగా విషం యిచ్చి చంపినట్లు. చిట్టచివరి క్షణం దాకా, అంటే పన్ను ఊడి వచ్చేసేదాకా యీ ఘోరమైన సత్యం తెలియనేలేదు. తెలినదేమిటంటే—తెలిసీ చేసిన అశ్రద్ధ అని. ఆటువంటి సరియైనదికాని టూత్‌బ్రష్‌తోనూ, టూత్‌పేస్ట్‌తోనూ పళ్ళను తోమటం.

మరి బినాకా ఫ్లోరైడ్ గనక తప్పకుండా ఎప్పుడూ వాడివున్నట్లయితే, యీ విషాద సంఘటన జరిగివుండేది కాదు. ఎందువల్లనంటే, బినాకా ఫ్లోరైడ్‌లోగల యస్.ఎమ్.ఎఫ్.పి మూడు విధాలుగా పళ్ళల్లోని కంతల్నుంచీ దంతక్షయాన్నుంచీ రక్షిస్తుంది.

- పంటి ఎనామిల్‌ని గట్టిపరచటానికి
- నోటిలో తయారయ్యే ఏసిడ్ తయారు కాకుండానూ
- దంతక్షయాన్ని అరికట్టటానికి

మీ పళ్ళని హత్య చేయకండి
మీ పళ్ళని కాపాడుకోవటం కోసం

బినాకా ఫ్లోరైడ్




CIBA Cosmetics

ULKA-CF-30-TEL

సు: అంటే—. . . అయ్యబాబోయ్— నేనా? రవిగారూ, మీరే నన్ను రక్షించాలి! అమ్మాయి లేకపోతే పోసింది. మనమే మిగులుదాం, కానీ— అబ్బా— తలుచుకోవటానికే భయంగా ఉందండీ.

ర: పోనీ, ఒక పని చేద్దాం. లాటరీ వేసి అదృష్టం పరిశీలించుకొందాం.

భీ: మీరు చెప్పింది బాగుంది. అలాగే చేద్దాం. అమ్మాయిని తీసుకురావటం మాత్రం తప్పదు. ఏమండీ సుధాకర్—ఏమంటారు?

సు: తప్పుతుందా మరి? కానీ తరవాత మళ్లీ గొడవ పెట్టకూడదు. 'కావ్'గా బయటికి వెళ్లిపోవాలి. నేను ప్రొఫెసర్నీ, నేను ముందొచ్చానూ అనకూడదు.

ర: దట్సాల్‌రైట్. (టేబిల్ దగ్గిర మూడు కాగితాలు చింపి అందులో ఒక దానిమీద వ్రాసి) ఇదిగో ఇందులో ఒక దానిమీద ఇంటూ మార్కుంది. అది వచ్చిన వాళ్లు మాత్రం బయటికి వెళ్లిపోవాలి. ఓకే?

భీ: మూడు రాసేందుకూ? అంటే— అంటే ఒక వేళ నాకు వస్తే మీరైనా వెళ్లిపోతారు ఏం?

ర: నా స్పెషాలిటీ ఏ ముంది?

భీ: ఇదంతా కనుక్కొన్నది మీరేగా!

ర: అబ్బే—ఈ విషయంలో అందరం ఒకటే. అయినా ఈ భూమిమీద జీవకోటి అంతరించి పోకుండా చేసిన ఘనత, నేను చేయబోయే త్యాగం వల్లవస్తే, అంతకన్నా నాకు కావలసింది ఏ ముంటుంది... ఇదిగో, ఒక కాగితం తీసుకోండి. సుధాకర్‌గారూ— మీరూ ఒకటి. . .

(ముగ్గురూ మూడు వైపులకీ వెళ్లారు. ఉరుముతూంది. స్టేజిమీద లైట్లు ఆరిపోయాయి.)

భీ: ఏమైంది?

ర: కరెంట్ పోయినట్టుంది. (సుధాకర్ అగ్గిపుల్ల వెలిగించాడు.) ఇంట్లో ఫ్యూజ్ పోయి ఉండదు. ఊరంతా పోయి ఉంటుంది. ఒకటి రెండు నిమిషాల్లో వచ్చేస్తుందిలెండి.

భీ: (ఒక మూల అగ్గిపుల్ల వెలిగించి తన కాగితం చూసుకొన్నాడు.) ఇదిగో, నా కాగితం. ఇందులో ఏమీలేదు.

ర: (సుధాకర్ వెలుగు చూపిస్తూ ఉండగా తన కాగితం చూసుకొన్నాడు) సుధాకర్‌గారూ, మీ కాగితం చూపించండి. ఇదిగో, నాది ఇందులోనూ ఏమీ లేదు.

(అంతలో లైట్లు వెలిగాయి.)

భీ: అరె— కరెంట్ చాలా తొందరగా వచ్చేసిందే!

సు: (మూలగా వెళ్లి తన కాగితం చూసుకొని ఒక్క ఊపులో వెనక్కి వచ్చి రవి చేతులు పట్టుకొని) నేను చావను. చావలేను.

ర: అయితే మీకే. . .

సు: వచ్చిందండి. నాకే. కానీ, ప్రొఫెసర్, నే చావను. అసలా ఆలోచనే భరించలేను.

భీ: అదేమిటండీ, మనం అనుకొన్న ప్రకారం—

సు: వద్దు. అలా అనకండి, సార్. మనం ముగ్గురమే బ్రతుకుదాం. బ్రతికి ఉంటే బలుసాకు తినవచ్చు.

భీ: కానీ ఈ భూమిమీద ముందు—

సు: పోన్లెండి రాజుగారూ— అదేలా పోతే మనకేం?

ర: నో. అలా జరగటానికి మాత్రం ఎటువంటి పరిస్థితుల్లోనూ వీల్లేదు.

భీ: అయితే మరి ఇక ఆలస్యం ఎందుకు? (ముందుకు అడుగేశాడు)

సు: (అతని వైపు భయంగా చూసి, రవి చేతులు పట్టుకొని) బాబ్బాబూ. అలా మాత్రం అనకండి. ఇవి చేతులు కావనుకోండి. ఎలాగైనా నన్ను రక్షించండి. ప్లీజ్! జన్మంతా మీకు ఋణపడి ఉంటాను.

ర: క్షమించండి. నే నేం చెయ్యలేను.

సు: అంతేనా! పోనీ, రాజుగారూ, ప్లీజ్ నా కాగితం తీసుకొని మీది ఇచ్చెయ్యరూ? నా పిల్లలందరికీ మీ పేరే పెట్టుకొంటాను.

భీ: వాళ్లకీ చెబుతారా? వాళ్ల పిల్లలకీ నా పేరే పెట్టుకొమ్మని!

సు: అదెంత భాగ్యం! తప్పకుండా చెబుతాను. అయితే— అయితే మీరు ఒప్పుకొంటున్నట్టేగా— థాంక్స్— నిజంగా—

ర: ఏమిటండీ ఇది— అసలు. . .

సు: మీ రింకేమీ అడ్డు పెట్టకండి, ప్రొఫెసర్. ఆయన ఒప్పుకొన్నారు.

భీ: నే నొప్పుకోలేదే!

సు: మరి—

భీ: గాంభీర్యం నటిస్తూ) ఆలోచించాలి.

సు: అలా అనకండి. నే చావను. చావలేను. అసలా ఆలోచనే భరించలేను.

ర: ఇంక మీరేమీ మాట్లాడకండి. సుధాకర్‌గారూ, మీరు వెళ్లిపోవాలి. తప్పదు. రాజుగారూ, మీకు తెలిసిన వారికెవరనయినా తీసుకురండి. టైమ్ లేదు క్విక్.

సు: నే వెళ్లను. వెళ్లలేను.

భీ: జీవితమంటే అంత భయమెందుకోయ్, సుధాకరం. (నవ్వి) నీ బదులు నే వెళ్లిపోతానులే. ఇక దిగులుపడకు. క్షణం క్షణం ఛస్తూ బ్రతక్కు.

ర: అదేలా? మనం ముందు ముందు అనుకొన్న ప్రకారం—

భీ: పోన్లెండి, ప్రొఫెసర్. ఒంటరిగాణ్ణి. సంఘందృష్టిలో ఎప్పుడో మరణించిన వాణ్ణి— జీవితపు కొన అంచులమీద నిలబడి మృత్యువుని కౌగలించుకొని ఉన్న నాకు బ్రతుకు భయుందేనికి? ఇతడినీ, ఇతని జీవితంమీద ఆశనీ చూస్తోంటే.

సు: చాలు. చాలు, రాజుగారూ. థాంక్స్. ఇంక మీ రేమీ చెప్పద్దు. ఆ మీరు మాట్లాడుకొంటూ ఉండండి. ఇప్పుడే వెళ్లి ఎవర్నైనా అమ్మాయిని. .

(వెళ్లబోయేడు.)

భీ: ఎవర్నైనా ఏమిటి? మీ భార్య ఉండగా—

సు: భార్యా— ఊఁ. . . ఆమెకీ నాకూ అసలే పడదండీ. అదీగాక పిల్లల్ని వదిలి ఆమె అసలు ఉండలేదుకూడా. ఈయనేమో గదిలో ముగ్గురి కంటే ఎక్కువ మంది ఉండటానికి వీల్లేదు అంటున్నారు. మరెలా?

ర: మరేం చేస్తారిప్పుడు?

సు: ఇంకెవర్నైనా. . .

భీ: కానీ టైమ్ చాలా తక్కువ. మీరు ఏ మాత్రం ఆలస్యం చేసినా—

సు: అక్కర్లేదండీ. ఇక్కడే ఉంది సుజాత. మొన్నే కొత్తగా పరిచయమైంది. ఆమెని తీసుకొని వస్తాను.

ర: పోనీ, కమల్ని తీసుకొని రా కూడదూ?

ర: పోనీ, కమల్ని తీసుకొని రాకూడదూ?

సు: కమలా!

ర: అవును. కమలే! ఎప్పుడూ మీ రూపే కళ్లలో నిలుపుకొని, మీ గురించే సుఖాలన్నీ వదులుకొన్న కమల...

సు: కమల! నా ప్రేమ పంచుకొన్న కమల. . . నా హృదయంలో నిద్రపోతున్న కమల. . . (రవి వైపు తిరిగి) ఎక్కడుంది? ఎక్కడుంది, ప్రొఫెసర్, ఆమె?

ర: అప్పుడు మీకు అబద్ధం చెప్పాను. ఆమె ఎక్కడుందో నాకు తెలుసు. ఈ ఊళ్లోనే. మీ గురించే పెళ్లి చేసుకోకుండా ఉండిపోయింది. మీ తలపుల్లోనే జీవిస్తోంది.

సు: తొందరగా ఆమె అడ్రెసివ్వండి. నేను ఫూల్ని నిజంగా. ఇంత కాలం నన్నింతగా ప్రేమిస్తూన్న అమ్మాయిని నిర్లక్ష్యం చేశాను. అడ్రెస్ రాసి ఇవ్వండి, ప్రొఫెసర్!

ర: ఇదిగో ఇప్పుడే వ్రాస్తున్నాను. (పెన్‌తో వ్రాస్తూ ఉండగా ...)

సు: కమలతో కలిసి కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తాను. ఇన్నాళ్లూ ఆమెని ఇంత బాధ పెట్టినందుకు క్షమాపణ చెప్పుకొంటాను. ఈ సుధాకర్, కమలల పేరు ఆదిదంపతులుగా ఈ ప్రపంచంలో నిలిచిపోవాలి. నా ప్రేమకి చిహ్నంగా కమలకి ఈ ప్రపంచాన్నే బహుమతి ఇస్తాను. రోమియో — జూలియట్, దేవదా—పార్వతీ, లైలా...

ర: ఇదిగో అడ్రెసు.

సు: థాంక్స్. (వెళ్లబోయాడు.)

ర: ఒక్క విషయం జ్ఞాపకం ఉంచుకోండి. సరిగ్గా ఇంకో పదిహేను నిమిషాల్లో ఈ గది తలుపులు మూసుకుపోతాయి. మీరు ఆలస్యం చేస్తే బయటే మసి అయి పోవలసి వస్తుంది.

సు: అంటే... ఓహ్. . . అర్థమయింది. కమల ఇల్లెంత దూరం? బంజారా హిల్స్. బాబోయ్! ఇంత దూరమే! నలభై మైళ్ల స్పీడులో వెళ్లినా ఆమెని తీసుకు రావటం కష్టమేనే!

భీ: పోనీ, అరవై మైళ్ల స్పీడులో వెళ్లండి.

సు: మధ్యలో కారు పాడవుతే? ఆక్సిడెంట్ అవుతే?

భీ: (నవ్వి) మీ బదులు నేను బ్రతుకుతాను.

సు: బాబ్బాబూ. మాట తిరిగిపోకండి. (రవి వైపు తిరిగి) అంత రిస్క్ తీసుకోవటం ఇష్టం లేదండీ. ఇక్కడే దగ్గిర్లో ఉన్న సుజాతని తీసుకొని వస్తాను.

ర: మరి మీ కోసం ఎదురుచూస్తున్న ఆ కమల?

సు: అది నిజమే అనుకోండి. కానీ, ఇది ప్రాణాంతో పనికదా! ప్రాణంకన్నా పెద్దవ ప్రేమ ముఖ్యమా చెప్పండి?

భీ: నిజమే. ప్రేమకన్నా పెళ్లి ముఖ్యం. పెళ్లికన్నా ప్రాణం ముఖ్యం.

సు: భలేగా చెప్పారు. మరి మీరు నాతో వస్తారా బయటెక్కడైనా డ్రాప్ చేస్తాను.

భీ: అబ్బే ఇంకా టైముంది కదండీ—

సు: దట్సాల్‌రైట్. మరి నే వెళతాను. పది నిమిషాల్లో వచ్చేస్తాను. (ఆగి) మనలో మన మాట— ఇందులో ఏమీ మోసం లేదుగా?

ర: సుధాకర్‌గారూ! మీరు అనవసరంగా టైమ్ వేస్ట్ చేస్తున్నారు.

సు: నిజం నిజం. మరి నే వెళతాను. అయిదు నిమిషాల్లో వచ్చేస్తాను. భీమరాజు గారూ! ఇదే మనం ఆఖరి సారి కలుసుకోవటం అనుకుంటా. గుడ్‌బై. తలు పేసెయ్యకండేం? వస్తాను. (వెళ్లిపోయాడు.)

ర: ఇడియట్!

భీ: కాదు. మనిషి. మామూలు మనిషి. మనుషుల మానసిక బలహీనతలకి ప్రతినిధి.

ర: మీరు చెప్పింది నిజమే! ఒక్క నిమిషం. . . కాఫీ తెస్తాను. (లోపలికి వెళ్లాడు. భీమరాజు కిటికీ దగ్గరగా వెళ్లి బయటికి చూడసాగాడు. మళ్లీ వర్షం మొదలైంది. రవి కెటిల్‌తో వచ్చి కూర్చొని కాఫీ కలపసాగాడు.)

భీ: ఇంక ఎంత టైముంది, ప్రొఫెసర్? (కంఠంలో వేదన లేదు. కానీ, బరువుగా ఉంది.)

ర: నా లెక్క ప్రకారం 8—45 కి. . . రండి. కాఫీ తీసుకోండి.

భీ: (కదల్లేదు) 8—45 కి (గొణిగాడు.) ఈ కుత్సితమైన మనుషుల నుంచీ, అనుక్షణం గంద్రగోళంతో స్పందించే ఈ సంకీర్ణ ధ్వనులనుంచి ప్రపంచానికి విశ్రాంతి లభిస్తోందన్నమాట. మహోన్నత పర్వతాగ్రల నుంచి దూకి కదలికి అంకితమయ్యే జీవనదుల నడకలో సౌందర్యం, బాలభానుని బంగారు లేకిరణాలలో మేలిమునుగు సవరించుకొనే పచ్చిక బయళ్లూ, మంచు కడిగిన మల్లెలాటి తెల్లటి ఆకాశం, దూరంగా కొండల వెనక నుంచి ఎర్రటి ఉషస్సు, తీగెతీగెలుగా జాలువారే వెన్నెలలో స్ఫటికపు రాళ్లమీదనుంచి గలగలా పారే సెలయేటి నీలివర్ణాల, గుర్తుతెలియని చిత్రకారుని కుంచె ఏర్పరిచిన రకరకాల రంగుల కలయిక—ప్రకృతితో పోరాటం లేకుండా మనిషి మనుగడ— ఓహ్— ఎంత అందమైన కల!

ర: నిజం కాని కల!

భీ: (కదల్లేదు.) ఔను. నేను ఉండను. నాకు తెలుకు— ఇది నిజం కాలేదనే వాస్తవం నన్ను భయపెట్టటం లేదు. కానీ, నా ఈ జీవితపు చివరి క్షణాల్లో నాలో ఎప్పుడో చచ్చిపోయిన భావుకుడు మేలుకొంటున్నాడు. అంతే.

ర: (కాఫీ ఇచ్చాడు.) మీరు చాలా డ్రీమర్‌లా ఉన్నారే.

భీ: ఇప్పుడు కాదు. నా జీవితం ఇలా మలుపు తిరక్కముందు. ప్రొఫెసర్! నాదో చిన్న అనుమానం! మీ మొహం అంతా అలా కాలిపోయిందేం? ఏదైనా ఆక్సిడెంట్ జరిగిందా?

ర: మీరు ఊహించింది నిజమే, రాజా! దాదాపు మూడు సంవత్సరాల క్రితం ఒక ఎక్స్‌పరిమెంట్ చేస్తూ ఉంటే ఈ ప్రమాదం జరిగింది. అదృష్టం బాగుండబట్టి కళ్లు పోలేదు. ఇప్పుడనిపిస్తోంది అలా జరిగినా బాగుండునేమో అని.

భీ: అదేమిటి?

ర: (నవ్వి) ఫేస్ ఈజ్ ది ఇండెక్స్ ఆఫ్ మైండ్ కాబట్టి.

భీ: అలా అనకండి, ప్రొఫెసర్, బాహ్యస్వరూపానికీ, మానసిక సౌందర్యానికీ అసలు సంబంధం లేదు.

ర: అది నిజం అయితే అయి ఉండవచ్చు కానీ, ఆ నిజాన్ని ఒప్పుకొనే సంస్కారం చాలా మందికి ఉండదూ. . . ఆ సంస్కారం చదువు వల్ల రాదుకూడా.

భీ: ఔను. తన గురించీ, తన వ్యక్తిత్వం గురించీ సిన్సియర్‌గా ఆలోచించ గలిగే వ్యక్తులకే ఆ సంస్కారం వస్తుంది.

ర: ఇంత నిజాయితీగా ఆలోచించగలిగే మీరు ఇలా ఒక బందిపోటుగా మారిపోయారంటే చాలా ఆశ్చర్యంగా ఉంది.

భీ: (నవ్వి) ఎందుకు?

ర: ఒక రకమైన జీవితంలోనుంచి పూర్తిగా దానికి విరుద్ధమైన ఇంకో ఫేజ్‌లోకి మారటానికి మీలో చాలా అంతర్సంఘర్షణ జరిగి ఉండాలే?



నిరీక్షణ

చిత్రం—వై. భాంయ్య, (సిద్దిపేట) ఆం.ప్ర.

భీ: లేదు, ప్రొఫెసర్! పరిస్థితులు చాలా తొందరగా మార్చేశాయి నన్ను. . . నాన్న పోయాడు. నాకు ఉద్యోగం దొరకలేదు. సంఘం దృష్టిలో గౌరవంగా బ్రతుకుదామన్న నా ఆశ అత్యాశే అయింది. జబ్బు తనని తినేస్తూ ఉంటే, తను మందుల్ని తినలేక అమ్మ చచ్చిపోయింది. నేనూ, చెల్లీ— ఇద్దరమే మిగిలాం. దాని కప్పుడు పదహారేళ్లు. (ఆవేశంగా) దాని అమాయకత్వాన్ని, తెలిసీ తెలియనితనాన్నీ తన స్వార్థానికి బాగా ఉపయోగించుకొన్నాడు ఒక నీచుడు. వాడి కామాన్ని ప్రేమ అనుకొంది అది. (వణికాడు.) నాకు తెలిసేసరికే పరిస్థితి చెయ్యి దాటిపోయింది. (ఏడుస్తున్నాడు.) చెల్లి చచ్చిపోయింది. . . ఇక నాకు మిగిలింది పగ ఒక్కటే. . , ఆచూకీ తీశాను. (ఆవేశంగా) ఆ నీచుడి పేరు బ్రహ్మానందం. వాడి గురించి ఇంకో రెండు మూడు ఆధారాలు దొరికాయి. వెతకడం మొదలుపెట్టాను. చివరికి ఒక రోజు. . . ఒక రోజు వాడు దొరికాడు. నిర్దాక్షిణ్యంగా చంపేశాను. అదే నేను చేసిన మొదటి హత్య. కానీ— కానీ తరవాత తెలిసింది. . . నేను చంపింది ఇంకొకర్ని. ఆ బ్రహ్మానందం వేరు. ఈ విషయం తెలిసి కంపించిపోయాను. . . నా అన్వేషణ, పగ. . . రెండింతలయ్యాయి. అప్పటినుంచీ నా అన్వేషణ సాగుతూనే ఉంది.

ర: ఆవేశపడకండి.

భీ: ఆవేశం కాదు, ప్రొఫెసర్, నా జీవితంలో. . . (బయట కారు చప్పుడయింది.)

ర: అదిగో, కారు వచ్చేసింది. ఇంత తొందరగా వచ్చేశాడేమిటి?

(తలుపు తీశాడు.)

(సశేషం)

(క్రిందటి సంచిక తరువాయి)

సు: (వస్తూ) చాలా లక్కీ, గురూగారూ! ఇంటివరకూ వెళ్ళనక్కర్లేకుండానే దారిలో ఆమె కారు కనబడింది. దా న్నక్కడే వదిలేయమని నా కార్లో ఎక్కించుకొని తీసు. . . (రాజు వైపు చూసి) అరె. మీ రింకా ఇక్కడే ఉన్నారేమిటి?

భీ: ఇంకా టైముందిగా? వెళతాను.

సు: అమ్మాయిని చూసి మనసు మార్చుకోరుగా! కోరులెండి. ఆఁ-ఇంతకీ ప్రేమ రాలేదేం లోపలికి? ప్రేమా, ప్రేమా! (ఈ లోపున రాజు రెయిన్‌కోట్ తీసుకొని బయటికి వెళ్ళాడు.)

ర: అదేమిటి? సుజాత అనే అమ్మాయిని తీసుకొస్తానన్నారు!

సు: ష్. . . గట్టిగా అనకండి— వినపడగలదు. దారిలోనే ప్రేమ కనపడింది. సుజాత కన్నా రీసెంట్ గర్ల్ ఫ్రెండ్. పైగా సుజాత ఇల్లు దూరంకూడాను. అరె అదేమిటి. . .

(రాజూ, ప్రేమా— ఇద్దరూ ఒకే రెయిన్‌కోట్‌లో లోపలికి వచ్చారు.)

ప్రే: (రెయిన్‌కోటులోంచి బయటి కొచ్చి రాజు కళ్ళలోకి చూస్తూ) థాంక్స్ అండి. (సుధాకర్ వైపు తిరిగి) నీ కసలు కర్టెసీ తెలియదు, సుధా! ఈయన చూడు. వర్షంలో తడుస్తానేమోనని రెయిన్ కోట్ పట్టుకొచ్చారు.

సు: సారీ, ప్రేమా. . . ఆఁ — దట్సాల్‌రైట్. ఇదిగో, వీరే— నే చెప్పానుగా దారిలో— ప్రొఫెసర్ రవి? నీ అన్నయ్యలాటి వారు. (నొక్కి పలికాడు.)

ర: నమస్తే. ఇక్కడ మీ కేం కావలసి వచ్చినా సంకోచపడకండి.

సు: అవునవును. ఇది నీ స్వంత అన్నయ్య ఇల్లులాటి దనుకో. అంతేకదూ, ప్రొఫెసర్?
(రాజు సిగరెట్ వెలిగించాడు.)

ర: ఈయన రాజు.

ప్రే: థాంక్స్, ప్రొఫెసర్!

ర: నా క్కాదు. (రాజుని చూపించి) ఈయనకి చెప్పండి

ప్రే: అవును. సుధ లాటరీలో గెలిచాడటగా ...

ర: అలా చెప్పాడా? అసలు జరిగిందేమిటంటే. . .

సు: సర్లెండి. ఇప్పు డదంతా ఎందుకు? చూడండి, రాజూ, నేను వచ్చేశానుగా...

భీ: ఇక మీరు వెళ్ళండి అంటారు. అంతేనా?

సు: అబ్బే అది కాదు, నా భావం.

భీ: మీ భావం ఏదైతేనేం? నే వెళ్ళే టైమైంది. ప్రేమా! నా మీద ఉన్న అభిమానానికి థాంక్స్. సుధాకర్! బెస్ట్ ఆఫ్ లక్. ప్రొఫెసర్! (దగ్గరి కొచ్చాడు.) గుడ్‌బై. గుడ్‌బై ఆల్ ఆఫ్ యూ. (వెళ్ళిపోయాడు.)

ప్రే: (తలుపు వరకూ వెళ్ళింది.) పోనీ, నలుగురం సర్దుకుంటే. . . అసలు ఏం పడదంటారా?

ర: లాభం లేదు, ప్రేమా! అది ఎటువంటి పరిస్థితుల్లోనూ సాధ్యం కాదు

ప్రే: ఏ మాత్రం వీలైనా చూడండి, ప్రొఫెసర్!

సు: ఆయన ఆక్సిజెన్ సరిపోదని చెప్పటంలే? అయినా, ఆ దొంగమీద నీ కెందుకు అంత ఇంటరెస్టు?

(ప్రేమ తిరస్కారంగా చూసి కిటికీ దగ్గిరికి వెళ్ళింది.)

ప్రే: (బయటికి చూస్తూ) ఎంత నిశ్చింతగా వెళ్ళిపోతున్నాడో—ఏ ఆవేశమూ బాధా లేకుండా ఠీవిగా. . .

ర: అవును. మామూలు మనుష్యుల బలహీనతల్ని తమ త్యాగంతో పరిహసించ గలవాళ్ళకే వస్తుంది ఆ ఠీవి.

సు: మరి తలుపేసేయనా, ప్రొఫెసర్? (వెళ్ళబోయి ఆగి) ఏమి టాలోచిస్తున్నారు?



ప్రే: (అప్పటివరకూ రాజునే చూస్తోంది.) రాజు— రాజంటే—ఆఁ — జ్ఞాపకం వచ్చింది. ఎక్కడ చూశానా అని ఆలోచిస్తూ ఉన్నాను ఇంత సేపూ. మీరు భీమరాజు కదూ? అబ్బా— మిమ్మల్ని చూడగలనని కలలోకూడా అనుకోలేదు నేను. మీకు నే నంత ఫాన్‌నో మాటల్లో చెప్పలేనండీ. నే నొక్కదానినేమిటి? మా కాలేజీ అమ్మాయిలందరూ మీ అడ్వెంచర్స్ అన్నీ ఎంత థ్రిల్లింగ్‌గా చదువుతామో తెలుసా? మొన్న పేపర్లో మీ ఫోటో కత్తిరించి. . .

సు: భీమరాజు ఇతనా? (చెయ్యి రివాల్వర్‌మీద ఉంచి తీసేశాడు.)

ప్రే: అవును, సుధా! ఈయనంటే నా కెంత హీరో వర్షిప్పో! ఈయనతో కలిసి ఒకే రెయిన్‌కోట్‌లో పక్క పక్కన. . . అబ్బ ఎంత థ్రిల్లింగా ఉందో— ఏదో ఇంగ్లీషు పిక్చర్లో. . .

సు: ప్రేమా! (అరిచి అంతలోనే తమాయించుకొన్నాడు.) నే చెప్పానే— ఒకరు బయటికి వెళ్ళిపోవాలని? అది ఇతనే.

ప్రే: అవును. అది మరిచేపోయాను. ప్రొఫెసర్! సుధా కార్లో చెప్పాడు. ప్రళయం వస్తోందనీ, మనం ముగ్గురమే మిగులుతామనీ, నన్ను ఇలా ఒంటరిగా తీసుకు రావటం కోసం వేసిన ప్రాక్టికల్ జోకేమో అనుకున్నా. ఇప్పు డిదంతా చూస్తుంటే నిజమేనేమో ననిపిస్తోంది.

ర: సుధాకర్ చెప్పినదానిలో అబద్ధమేమీ లేదు. అందుకే అంత అర్జెంటుగా మిమ్మల్ని తీసుకురావలిసి వచ్చింది.

## యండమూరి వీరేంద్రనాథ్

ర: (ఆగి) చిన్న పొరపాటు జరిగిందేమో అనిపిస్తోంది.

సు:, ప్రే: ఏమిటది?

ర: ప్రళయం రావటానికి పది నిమిషాల ముందే రేడియో ఆక్టివ్ ప్రభావం మన వాతావరణంలో ప్రవేశించి ఉంటుందని నా అనుమానం. అలా జరక్కపోతే పర్లేదు. కానీ, అదే జరిగిన పక్షంలో. . .

సు: చెప్పండి, ప్రొఫెసర్, ఆపేశారేం?

ర: అదే జరిగిన పక్షంలో అది మేల్ జెనెటివ్ ఆర్గన్స్‌మీద తన ప్రభావం చూపకుండా. . .

ప్రే: అంటే మీ ఇద్దరూ—

ర: నాకు ఫరవాలేదు. కానీ, బయట వాతావరణంలో తిరిగిన సుధాకరానికి మాత్రం...

సు: ఏమవుతుంది, ప్రొఫెసర్?

ర: మీకు పుట్టబోయే పిల్లలు బహుశా అంగవైకల్యంతో పుడతారు. లేకపోతే అసలు పుట్టరు.

ప్రే: మీ అంచనా తప్పటానికి వీల్లేదా, ప్రొఫెసర్?

ర: ఉంది. కానీ, నిజం అవటానికికూడా అంత వీలూ ఉంది.

సు: మరి ఇప్పుడెలా?

ర: ఈ విషానికి విరుగుడు ఒకటుంది, సుధాకర్! మోనాసెటిక్ ఆసిడెస్టర్ సెల్ సైక్లిక్ ఆసిడ్. సాధారణంగా ఇది ఎక్కడా విడిగా దొరకదు. కానీ, ఆస్పిరిన్‌లో ఒక పెర్సెంట్ ఉంటుంది. దాదాపు ఒక పది టాబ్లెట్స్ వేసుకుంటే మన సుధాకరం మామూలు మనిషి అవుతాడు.

సు: కానీ, ఇంత వర్షంలో మెడికల్ షాపు లెక్కడుంటాయి? టైమెక్కడుంది?

ర: అది చూసుకోవటం మీ బాధ్యత—

సు: అదేమిటండీ! ఈ లోకంలో మానవజాతి అంతరించి పోకుండా ఉంచవలసిన బాధ్యత మన అందరిమీదా ఉందిగా?

ర: మన అందరి మీదా ఉందన్న విషయం మీరు ఒప్పుకొంటే అసలు గొడవే లేదు. మే మిద్దరం...

సు: అంటే? (అర్థమైంది) అన్యాయం. . . ఇది చాలా అన్యాయం, ప్రొఫెసర్! నేను ప్రాణాన్నికూడా రిస్క్ తీసుకొని అమ్మాయిని తీసుకొస్తే. . .

ప్రే: ఆవేశపడకు, సుధా, ఇప్పుడేమయింది? (రవి వైపు తిరిగి) ఇంకా ఎంత టైముంది, ప్రొఫెసర్?

ర: (వాచీ చూసి) అయిదు నిమిషాలు!

ప్రే: అయిదు నిమిషాల్లో కార్లో వెళ్లి వచ్చెయ్యలేవూ?

ర: చూడు, సుధాకరం! ఇక్కడే దగ్గర్లో మెడికల్ షాపు ఒకటుంది. దాని యజమానిదికూడా పక్క ఇల్లే. వెళ్లి తొందరగా వచ్చెయ్యండి.

సు: ఇందులో మోసం ఏమీ లేదుగా?

ప్రే: ఏమిటా మాటలు, సుధా! ఆయనేగాని నిన్ను మోసం చెయ్యాలనుకొంటే ఇంత గొడవ దేనికి?

సు: సరే అయితే. తొందరగా వెళ్లి వచ్చేద్దాం. నువ్వూ రా.

ప్రే: నేనా? నే నెందుకు?

ర: అవును, ఆ మెందుకండీ? సుధాకర్! మీరు అనవసరంగా టైమ్ వేస్ట్ చేస్తున్నారు.

సు: (అనుమానంగా చూసి) సరే వెళుతున్నాను. ఒక నిమిషం అటూ ఇటూ అయినా నా కోసం చూడండి. తలుపు వేసెయ్యకండి. ఓకే. . . (వెళ్లి పోయాడు.)

ప్రే: (అటు వైపే చూస్తూ) అయిదు నిమిషాల్లో వచ్చెయ్యగలడంటారా?

ర: చూద్దాం.

ప్రే: ఒక వేళ మెడిసిన్ దొరక్కపోతే—

ర: ఎక్కువ సేపు షాపు కోసం వెతకడనే నా ఉద్దేశ్యం. మందు దొరక్కపోతే తిరిగి వచ్చేస్తాడే గాని, ప్రాణాల్ని మాత్రం రిస్క్‌లో పెట్టడు.

ప్రే: అలాగే గానీ అయితే—

ర: సంఘటనల్ని మనం ఊహించద్దు, ప్రేమా! చూద్దాం ఎలా జరుగుతుందో...

ప్రే: ఆ మందు వేసుకొంటే ఇక మీరు చెప్పిన రేడియమ్ ప్రభావం అసలు ఉండదంటారా?

ర: (ఆలోచించాడు.) అదీ చెప్పలేను.

ప్రే: (గాభరాగా) అంటే?

ర: ఆ మందు అతని మీద పనిచేయక పోవచ్చుకూడా. మనం వేచి చూడవలసిందే.

ప్రే: అదే నిజమైతే అతనికి పిల్లలు పుట్టరు. పుట్టినా అంగవైకల్యంతో పుడతారు— అంతేనా, ప్రొఫెసర్?

ర: అంతే.

ప్రే: అలాగే అయిన పక్షంలో. . . ప్రొఫెసర్. . . మీ తెలివితేటలూ, నా అందమూ కలిస్తే పుట్టబోయే. . . జా. . . తి. . .

ర: ఏమిటి, ప్రేమా, మీ రంటున్నది?

ప్రే: సంఘటనల్ని ఊహించద్దు, ప్రొఫెసర్— చూద్దాం. ఎలా జరుగుతుందో?

ర: కానీ, ప్రేమా...

ప్రే: అబ్బే. నేను మీ మీదా, నా మాతృత్వంమీదా ఇంటరెస్టుకొద్దీ ఈ మాటలు అనటం లేదు, ప్రొఫెసర్! ముందు ముందు ఈ ప్రపంచంలో మానవజాతి అంతరించకుండా. . .

ర: సరిలెండి. ఇంకా ఆ విషయం వదిలి పెడదాం.

ప్రే: ఇంకా ఎంత టైముంది?

(రవి వాచీ చూశాడు.)

ర: మూడు నిమిషాలు. ఈ పాటికి షాపు చేరుకొని ఉంటాడు.

ప్రే: సుధా చాలా బాగా డ్రైవ్ చేస్తాడు. ఇక్కడికి మూడంటే మూడు నిమిషాల్లో తీసుకొచ్చాడు. అతని స్పీడ్ చూసి నాకే భయం వేసిందికూడా.

ర: మీ ఇద్దరికీ పరిచయం ఎన్నాళ్లనుంచీ?

ప్రే: రెండు నెలల క్రితం ఒక పార్టీలో కలిశాడు. అప్పటినుంచీ పరిచయం పెరిగింది.

ర: అతనికి పెళ్లయింది. ఆ విషయం తెలుసా మీకు?

ప్రే: (నవ్వి) సిల్లీ. అయితే అయిఉండచ్చు. దానికీ, నాకూ ఏమిటి సంబంధం?

ర: అతని మీరు ప్రేమించటం లేదా?

ప్రే: ప్రేమంటే. . .

ర: ప్రేమంటే. . . ప్రేమ. . .

ప్రే: దాన్ని గురించి ఆలోచించి మనసు పాడు చేసుకోకండి, ప్రొఫెసర్! సైకాలజీ ప్రొఫెసర్లకే అంతుబట్టని విషయం అది.

ర: కానీ. . . మీ కింకొకరితో పెళ్లవుతే?

ప్రే: అవనివ్వండి. తప్పేముంది?

ర: ఇలా చెడిపోవటం తప్పు కాదా?

ప్రే: 'చెడిపోవటం' అనే మాటకి అర్థం లేదు ప్రొఫెసర్. పతనం అనేది ఎప్పుడు ప్రారంభం అవుతుంది? చెప్పండి. సిగరెట్ తాగినప్పుడా? తాగాలని అనిపించి నప్పుడా?

ర: క్రియతో...

ప్రే: అంటే, మనసులో ఎన్ని వెధవాలోచనలున్నా, తమ కోర్కెల్ని తీర్చుకోవటానికి భయపడే అప్రయోజకులందర్నీ మీరు సమర్థిస్తున్నారన్న మాట.

ర: లేదు, ప్రేమా! మనసులోకి చెడు ఆలోచన రావటమే పతనం.

ప్రే: అయితే, ఈ ప్రపంచంలో అందరూ చెడ్డవాళ్లే! కొంతమంది మంచివాళ్లు ఉండటానికి కారణం—వాళ్లకి చెడిపోవటం చేతకాకపోవటమే. అప్రయోజకులు అందరూ నీతిపరులే, ప్రొఫెసర్!

ర: నేను మాట్లాడేది చేతకానితనం గురించి కాదు, ప్రేమా! ఇంత లోతుగా



ప్రొద్దుటూరు శ్రీ శోభా కళామందిర్ వారు ప్రముఖ రంగస్థల నటుడు శ్రీ పి. కృష్ణారెడ్డిని ఇటీవల సన్మానించిన సందర్భంలో తీసిన ఫోటో.

ఆలోచించగలిగే మీకు, ఇంకెవర్నో పెళ్లాడవలసిన బాధ్యత మీ మీద ఉండగా సుధాకరాన్ని ప్రేమించటం తప్పు అనిపించటం లేదా?

ప్రే: దానికీ, దీనికీ సంబంధం ఏమిటి? ప్రేమ అనే పదాన్నిగానీ వాడవలసి వస్తే, మా ఇంటిముందు తోటనీ, నా బొచ్చుకుక్కనీ, నా కారునీ ఎలా ప్రేమిస్తున్నానో సుధాన్నీ అలానే ప్రేమిస్తున్నాను.

ర: కానీ, ఇంత చిన్న విషయానికి ప్రేమ అనేటంత పెద్ద పదం ఎందుకు? అభిమానం అనండి. స్నేహం అనండి.

ప్రే: ఇద్దరు మనుష్యుల మధ్య స్నేహం ఎప్పుడు ప్రేమగా మారుతుందో చెప్పటం చాలా కష్టం. ప్రొఫెసర్! ఈ విషయాన్నే మీరు ఒప్పుకొన్న పక్షంలో, ఒక వ్యక్తి ఎంతమందితోనైనా స్నేహం చెయ్యటానికి వీలున్న మన ఈ సామాజిక వ్యవస్థలో ఒక వ్యక్తి ఒకర్నే ప్రేమించాలంటే కష్టం.

ర: వ్యక్తుల్నే ప్రేమించటం ఎందుకు? వాళ్లలో మీకు నచ్చిన గుణాల్ని, కళల్ని ప్రేమించకూడదూ?

ప్రే: అంటే?

ర: ఒక వ్యక్తి సిన్సియారిటీ మీకు నచ్చవచ్చు. అలాగే ఇంకో వ్యక్తి గొంతెత్తి పాడితే ఆ పాట గంటల తరబడి వింటూ ఉండిపోవాలని అనిపించవచ్చు. అందువల్ల ఆ వ్యక్తుల్ని ప్రేమించటం ఎందుకు? వాళ్ల ఆర్ట్‌ని—అంటే వాళ్లలో ఉన్న కళని—ప్రేమిస్తే చాలుగా? ఒప్పుకుంటారా?

(ప్రేమ అవునన్నట్లు తల ఊపింది.)

ర: మరి ఈ బోయ్ ఫ్రెండ్స్, ఈ స్నేహం— ఇదంతా ఏమిటి?

ప్రే: స్నేహం అని మీరే అంటున్నారుగా? అది ప్రేమకాదు.

ర: అంటే మీ ఉద్దేశ్యం—స్నేహాన్నీ, ప్రేమనీ విడదీస్తున్న ఒకే ఒక పొర 'సెక్స్' అంటారు. స్నేహం— ప్లస్ సెక్స్— ఈజ్ ఈక్వల్టు ప్రేమ. అంతేనా?

ప్రే: మీరు మాట్లాడుతున్నది అబ్బాయికీ, అమ్మాయికీ మధ్య ఉన్న స్నేహం గురించే అయితే. . మీరు చెప్పేది నిజమే. ( దగ్గిరి కొచ్చి ) ఏమి టాలో చిస్తున్నారు?

ర: ప్రేమకి అర్థాన్ని ప్లెస్సూ, మైనస్సుల్లో ఇంత ఈజీగా చెప్పచ్చా అని ఆలోచిస్తున్నాను, ప్రేమా!

ప్రే: ఆలోచిస్తూనే ఉండండి. ఈ లోగా...

ర: ఓ నోను. మరిచిపోయాను. మీ రీ కిటికీ తలుపేసెయ్యండి. ( కిటికీ మూసేసింది. ) ఇంకో నిమిషమే ఉంది. ఇతనింకా రాలేదే? ఎలా?

ప్రే: తలుపు వేసెయ్యనా, ప్రొఫెసర్?

ర: వేసెయ్యండి. ఇక రానట్టే. ఆలస్యం చేస్తే మనకే ప్రమాదమే.

(తలుపు వెయ్యబోతూ ఉంటే తీసుకొని లోపలికి వచ్చాడు సుధాకర్. )

సు: సరిగ్గా సమయానికి వచ్చాను అనుకొంటూ. షేవువాడే ఆలస్యం చేశాడు. పది ఆస్పిరిన్ వేసుకొన్నాను. సరిపోతుంది కదూ, ప్రొఫెసర్?

ర: గుడ్. చాలు... ఆఁ. . . తలుపేసెయ్యండి. ఇక టైమ్ లేదు. నేను అటునుంచి




వచ్చి అల్ట్రారేడియమ్ కవర్ కప్పి సిలిండర్ ఆన్ చేసి వస్తాను.

( సుధాకర్ తలుపేశాడు. రవి లోపలికి వెళ్ళాడు. )

సు: ( వెనక్కి తిరుగుతూ ) ఏమంటున్నాడు ఈయన?

( ప్రేమ "ష్" అని సైగ చేసి వస్తున్నట్టు చూపించింది. )

సు: ఇలా రా. నీ కో చిన్న విషయం చెప్పాలి.

ప్రే: రహస్యమా?

సు: అవును. తొందరగా రా.

ర: (లోపలనుంచి వచ్చాడు. ) అంతా సరిపోయింది. ఇంకో నిమిషంలో కుజుడు భూమికి దగ్గిరగా వచ్చేస్తాడు. మూడు నిమిషాల పాటు. అంతే. మూడు నిమిషాల్లో ప్రపంచం మనకి గుడ్‌బై చెప్పబోతూంది.

సు: తరవాత తలుపు తీసెయ్యొచ్చా?

ర: ఆఁ. సరిగ్గా 8—45 కల్లా మనం బయట ప్రపంచంమీద అడుగు పెట్టచ్చు.

సు: ఈ లోపులో కొంచెం కాఫీ తాగితే?

ర: అరె. ఆ సంగతే మరిచిపోయాను. ఇప్పుడే తెస్తాను. మీ కోసమే ఫ్లాస్కులో ఉంచాను. ( లోపలికి వెళ్ళాడు. )

సు: ఇదిగో, ప్రేమా, ఇది ఎలాగైనా అతని కప్పులో కలపాలి. (చిన్న పాకెట్ ఇచ్చాడు. )

ప్రే: ఏమిటిది?

సు: పాయిజన్. పది నిమిషాల్లో ప్రాణం తీస్తుంది.

ప్రే: ఏమిటి? విషమా?

సు: అదే. జాగ్రత్తగా కలుపు. ఏ మాత్రం అనుమానం రాకూడదు మమా.

ప్రే: కానీ, సుధా. . .

సు: ష్. . . ఇంకేం మాట్లాడకు. నే చెప్పినట్టు చెయ్యి. మన ఇద్దరి మధ్యా మూడో మనిషి అనవసరం. మనతోపాటు ఇతనుంటే ఎప్పటికైనా ప్రమాదమే!

ప్రే. కానీ, ముందు ముందు ఆయనతో మన కేదైనా అవసరం వస్తే?

సు: ఏమీ రాదు. అన్నీ ఆలోచించే తెచ్చాను. నువ్వింకేమి మాట్లాడకు. లేకపోతే ఆ పాకెట్టు ఇలా ఇయ్యి. నేనే కలుపుతాను.

ప్రే: సరిలే. నువ్వు చెప్పినట్టే చేస్తాను గానీ, నువ్వు మాత్రం ఏమి కంగారు పడకు. అదిగో, ఆయ నొస్తున్నారు. (రవి కప్పులతో వచ్చాడు. )

సు: అదేమిటి? రెండు కప్పులే తెచ్చారు?

ర: మీ ఇద్దరికీ. నే నిప్పుడే రాజుతో కలిసి తాగాను. ఇంకోసారి తీసుకోలేను.

సు: నో నో. ఫేర్వెల్ పార్టీ కాబట్టి అందరం కలిసి తాగవలసిందే.

ర: ఫేర్వెల్ ఏమిటి? ఎవరు వెళ్ళిపోతున్నారు? (కప్పులు బల్లమీద పెట్టాడు.)

ప్రే: ఈ ప్రపంచానికి ఫేర్వెల్ అండీ.

ర: కానీ, నే నిప్పుడే. . .

ప్రే: కాఫీ కేముందండీ? ఎన్నిసార్లైనా తాగచ్చు. మీరూ ఒక కప్పు తెచ్చుకోండి.

ర: సరే. తప్పుతుందా మరి? (వెళ్ళాడు. )

సు: తొందరగా కలుపు, ప్రేమా! వచ్చేస్తాడు.

ప్రే: ఎందుకంత కంగారు, సుధా! ఇటువంటి విషయాల్లో మీ మగవాళ్ళు తల దూరిస్తే ఇంతే. అసలు పని జరగదు. పైగా హడావుడి ఎక్కువ. ఈ కప్పులో కలిపి ఎలా ఇస్తాం?

సు: మాటలు తరవాత. ముందు...

ర: (వస్తూ ) అరె...మీ రింకా తాగలేదే? తీసుకోండి, సుధాకర్! ప్రేమా! మీరుకూడా.

ప్రే: (సిప్ చేసి ) షుగర్ వేయటం మరిచిపోయారు.

ర: సారీ. ఇప్పుడే తెస్తాను. (కప్పు బల్లమీద పెట్టి వెళ్ళాడు. )

(సుధాకర్ని చూసి నవ్వి, కప్పులో కలిపింది. )

సు: నీది మాస్టర్ మైండ్, ప్రేమా! చెయ్యవలసిన దాన్ని నవ్వుతూ చెయ్యగలగటం ఒక్క ఆడవాళ్ళకే సాధ్యం.

ప్రే: కానీ, నీ కంగారు చూస్తుంటే ప్లానంతా పాడు చేస్తావేమోనని భయంగా ఉంది.

సు: నేనా? అసలు ఈ అయిడియా...

ర: (వస్తూ ) ఏమిటి అయిడియా అంటున్నారు?

ప్రే: అబ్బే— లాటరీ వేసి ఒకరు బయటికి వెళ్ళిపోవాలనే అయిడియా ఎవరికి వచ్చిందీ అని అడుగుతున్నానంతే. ఆఁ. ఆ పంచదార ఇలా ఇవ్వండి. (రెండు కప్పుల్లో కలిపి ) మీకూ కావాలా, ప్రొఫెసర్? చూడండి. ( కప్పు అందించింది. )

ర: (తాగి చూసి ) అక్కర్లేదు. సరిపోయింది. కాఫీ కొంచెం చేదుగా ఉంటేనే నా కిష్టం.

(ముగ్గురూ తాగుతున్నారు. )

సు: కప్పులో వేడివేడి కాఫీలాటిది యవ్వనం. మూడు గుటకలేస్తే అయిపోతుంది. (నవ్వాడు. )

ప్రే: వెయ్యకపోతే చల్లారిపోతుంది. (కప్పు పెట్టేసింది. )

ర: (నవ్వి ) ఒక వైపు కొంపలు మునిగి పోతూ ఉంటే మీరు జీవిత సత్యాలు నవ్వుతూ చెబుతున్నారే!

ప్రే: (నవ్వి ) మనది మునగటం లేదు కాబట్టి. అంతేనా, సుధా?

సు: కరెక్ట్.

ప్రే: మనం బయటికి వెళ్ళటానికి ఇంకా ఎంత టైముంది, ప్రొఫెసర్?

ర: రెండు నిమిషాలు. ఈ పాటికి బయట ప్రపంచంలో పూర్తిగా ఆక్సిజన్ ఖర్చయిపోతూ ఉండి ఉంటుంది. మనుష్యులు ఊపిరి అందక బాధపడుతూ ఉంటారు. పల్లపు ప్రదేశాలన్నీ నీటితో మునిగిపోయి ఉంటాయి. ( ఉరిమింది.) ఆక్రందనలతోనూ, ఆర్తనాదాలతోనూ ప్రపంచం అంతా గగ్గోలు పెడు

తోంది. అయిపోతోంది. ఈ ప్రపంచంలో జీవకోటి అంతరించి పోతోంది. మళ్లీ కొత్త సృష్టి జరుగుతుంది. ఇంకొక్క నిమిషమే. నూతన శకానికి నాంది పలికే మధుర క్షణం. (ఉరిమింది.)

ప్రే: (దగ్గరగా చేరి) నాకు భయంగా ఉంది, ప్రొఫెసర్!

ర: భయమా? ఎందుకు? ఒక్క నిమిషం ఓపిక పట్టండి. బయటికి వెళ్లిపోవచ్చు. (అందరూ దగ్గరగా చేరారు. వరమటం ఆగిపోయింది. అంతా నిశ్శబ్దం ఆవరించింది. టిక్ టిక్ మనే గడియారం చప్పుడు వినిపిస్తోంది. అంతే. రవి గడియారం చూస్తున్నాడు.) ఇక పది సెకన్లే... (ఎవరూ మాట్లాడ లేదు.) అయిదు... నాలుగు... మూడు... రెండు... ఒకటి— (ఉరిమింది. అర క్షణం పాటూ విరామం లేకుండా ఉరిమింది.) అయి పోయింది. (అందరూ రిలాక్స్ అయ్యారు.)

సు: తలుపు తీసేయచ్చా, ప్రొఫెసర్?

ర: నేను తీస్తాను. (తీశాడు.) మిస్టర్ సుధాకర్ అండ్ మిస్ ప్రేమా! కొత్త ప్రపంచం మిమ్మల్ని ఆహ్వానిస్తోంది. వెళ్లండి. మళ్లీ సృష్టికి ప్రారంభోత్సవం చెయ్యండి. ఆడమ్ అండ్ ఈవ్‌ల పేర్లు నిలిచినట్టే మీ పేర్లూ శాశ్వతంగా నిలిచిపోతాయి. అంతులేని సంపదలకు అధిపతులు మీరు. ఈ ప్రపంచం అంతా మీదే. వెళ్లండి. అనుభవించండి.

సు: థాంక్స్, ప్రొఫెసర్... రా, ప్రేమా... గుడ్‌బై, ప్రొఫెసర్!

ర: గుడ్‌బై చెబుతున్నారేమిటి? మళ్లీ అసలు కలుసుకోరా?

సు: వీలుంటే తప్పకుండా.

ర: వీలా?

ప్రే: ఆ మాటకేం, ప్రొఫెసర్! తప్పకుండా కలుసుకొంటాం.

ర: థాంక్స్.

ప్రే: ఆ మాట నేను చెప్పాలి. చివరి క్షణంలో నేను సుధాకి కనబడటం నిజంగా నా అదృష్టం. మీ మేలు మే మెప్పటికీ మరిచిపోలేం. మీ సహాయానికి నా కృతజ్ఞత ఎలా చెప్పుకోవాలో కూడా తెలియటం లేదు.

ర: నేను చేసింది చాలాతక్కువ, ప్రేమా! మీ కృతజ్ఞతలకి అర్హుడు ఇంకో వ్యక్తి.

ప్రే: భీమరాజుకదూ?

ర: అవును. సమాజం దృష్టిలో దొంగ అతను. కానీ... మనిషిని అనుభవం ఎంత డామినేట్ చేసినా, మానవత్వం మీద మాత్రం దాని ప్రభావం ఉండదనే సత్యాన్ని నిరూపించిన వ్యక్తి అతను.

సు: మరి... మే మిక వెళ్లిపోవచ్చునా, ప్రొఫెసర్?

ర: క్షమించండి. అనవసరంగా మాటలతో మిమల్ని ఆపుచేస్తున్నాను. ప్రేమా! ఇటు రండి. (చేతులు కలిపాడు.) వెళ్లండి. ఏడడుగులు వేసి విశాల విశ్వంలోకి అడుగు పెట్టండి.

(ఇద్దరూ మూడడుగులు వేశారు కలిసి. ప్రేమ నిశ్చేష్టురాలై అలాగే ఆగిపోయింది. సుధాకర్ అప్రయత్నంగా రెండడుగులు వెనక్కి వేశాడు. రెండడుగులు వేసి లోపలికి వచ్చిన వాడు భీమరాజు. ఒక్క నిమిషం అందరూ నిశ్చేష్టులై నిలబడ్డారు.)

భీ: మీరు చెప్పిన టైమ్ అయిపోయింది, ప్రొఫెసర్! కానీ, బయట అంతా మామూలుగానే ఉందే! వర్షంకూడా తగ్గిపోయింది. మనుష్యులందరూ బయట కొచ్చి పనులు చేసుకొంటున్నారుకూడా.

ప్రే: ఏమిటి, ప్రొఫెసర్, ఇదంతా? మీ అంచనాగానీ తప్పిందా? ప్రళయం రాలేదా? మాట్లాడండి, ప్రొఫెసర్! ఇంత ఎగ్జైట్‌మెంట్ మేం భరించలేం. చెప్పండి. మీ ప్రయోగం ఫలించలేదా?

ర: (తాపీగా) నా ప్రయోగం గ్రాండ్ సక్సెస్ అయింది, ప్రేమా!

భీ: కానీ, బయట...

ర: నేను చెబుతున్నది ఆ ప్రయోగం గురించి కాదు. ప్రేమ మీద నా కున్న అభిప్రాయాన్ని బలపరుచుకోవటం కోసం సుధాకరంమీద చేసిన ప్రయోగం ...

సు: (అప్పటివరకూ బొమ్మలా నిలబడ్డవాడు కదిలాడు.) ఏమిటి, ప్రొఫెసర్, మీరు అంటూ...

ర: నేను చెప్పవలసింది ఇంకా పూర్తి కాలేదు, సుధాకరం, నువ్వు మాట్లాడకు... మిస్ ప్రేమా, భీమరాజూ! ఈ ప్రయోగంలో మిమ్మల్నికూడా ఉపయోగించు కొన్నందుకు క్షమించండి. సుధాకర్! ఇదంతా ఎందుకు చేశానో నీ అనుమానం తీరాలంటే నా ప్రశ్నకి సమాధానం చెప్పు—కమల ఎవరు?

సు: ఇప్పుడు కమల ప్రసక్తి దేనికి?

ర: నా ప్రశ్నకి సమాధానం ఇంకో ప్రశ్న కాదు. చెప్పు. కమల ఎవరు?

సు: చదువుకొనే రోజుల్లో నా క్లాస్‌మేట్!

ర: అంతేనా?

సు: నన్ను మనస్ఫూర్తిగా ప్రేమించింది.

ర: మరి నువ్వు?

సు: ఆఁ. నేనుకూడా.


ర: కమల్నీ, ఈ ప్రేమనీ, నీ రీసెంట్ గర్ల్‌ఫ్రెండ్ సుజాతనీ— ఇంతమందినీ మనస్ఫూర్తిగా ప్రేమించగలిగేటంత విశాలమైనదా నీ మనసు?

సు: ఇలాటి ప్రశ్న అడగటానికి మీకు...

ర: అధికారం ఉంది, సుధాకరం! ఒక మనిషిగా. ఈ సమాజానికి ప్రతినిధిగా... చెప్పు.

సు: కమల్ని మాత్రం నిజంగానే ప్రేమించాను. ఫస్ట్ లవ్ కాబట్టి... కమలకూడా నన్ను గాఢంగానే ప్రేమించింది.

ర: కమల్ని మరి పెళ్లెందుకు చేసుకోలేదు?




సు: ప్రేమకు పర్యవసానం పెళ్లి కాదు.

ర: మరి ప్రేమించటం ఎందుకు? (ఆవేశంగా అడిగాడు.)

సు: రిలాక్సేషన్ కోసం! (తాపీగా చెప్పాడు.) అయినా, ఇదంతా మీరు ఎందుకు అడుగుతున్నారు? ఈ ప్రయోగమూ, ఇదంతా ఏమిటి?

ర: చెబుతాను... జీవితంలో జస్ట్ వెరైటీ కోసం అప్పుడప్పుడు ప్రేమించి రిలాక్సయ్యే మై డియర్ సుధాకరం! నువ్వు గాఢంగా ప్రేమించానని చెప్పుకొంటున్న ఆ కమల, నీ కోసమే ఎదురు చూస్తూ ఉందని తెలిసికూడా ఎవరి కోసమైతే నీ ప్రాణాల్ని అయిదు నిమిషాల పాటూ రిస్క్‌లో పెట్టలేకపోయావో ఆ కమల... నా భార్య.

భీ: ఏమిటి?

సు: కమలా?! నే ప్రేమించిన కమలా?

ర: ప్రళయం వస్తోందనీ, ప్రణయసామ్రాజ్యం ఏలటానికి నీ కిష్టమయిన వ్యక్తి నెవర్నైనా తెచ్చుకొమ్మనీ నే నన్నప్పుడు, వెళితే తిరిగి రాలేమోననే భయంతో ప్రేమనంతా అతి సులభంగా త్యాగం చెయ్యగల నీకు, ప్రేమ గురించి మాట్లాడే హక్కు ఎక్కడుందోయ్, సుధాకరం?

సు: న న్నింతసేపూ ఫూల్ని చేసి ఆడించటంలో మీ ఉద్దేశ్యం ఏమిటి?

ర: నీ ప్రశ్నలోనే ఉంది జవాబు.

సు: అంటే నే ఫూల్నా?... అస లిప్పుడు కమల ఎక్కడుంది?

ర: (గతం తాలూకు జ్ఞాపకాలతో కదిలిపోయాడు.) కమల చచ్చిపోయింది, సుధాకరం!

సు: చచ్చిపోయిందా?


ర: అవును. నిన్ను ప్రేమించిన నేరానికి, నీకు అర్థంకాని ప్రేమని ఇంకో కోణంలో చూసిన నేరానికి, నాతో జీవితాన్ని పంచుకోలేక కమల చచ్చిపోయింది, సుధాకరం! నీ తలపుల్లోనే జీవించింది. చివరి క్షణంలోకూడా నీ పేరే తలుస్తూ ప్రాణం వదిలింది. నీ ప్రేమ ఇంత చౌకబారుదని తెలిస్తే కమల బ్రతికేది. (ఆగాడు.) కమల తలపుల్లో నీ గురించి నేను చాలా గొప్పగా ఊహించుకొన్నాను, సుధాకరం! కానీ, నిన్ను చూసిన తరవాత తెలిసింది—ప్రేమంటే నీ కెంత అలుసో. నా అనుమానం తీర్చుకోవటానికి ఈ అరగంటసేపూ చిన్న నాటకం ఆడాను. ఈ అరగంట లోనూ నువ్వు ప్రాణాల కోసం ఉరుకులూ పరుగులూ తీస్తోంటే నాలో నేనే నవ్వుకున్నాను.

ప్రే: కానీ, ఈ ప్రయోగంవల్ల

ర: నువ్వు చెప్పేది నాకు తెలుసు, ప్రేమా! ప్రేమకి పర్యవసానం పెళ్ళి కానప్పుడు ఇంకొకరి భాగస్వామి కావలసిన స్త్రీ జీవితంలో ప్రవేశించి దానికి ప్రేమ అని పేరు పెట్టుకొనే ఈ సుధాకరానికి ఇంత చిన్న శిక్ష చాలదు.

ప్రే: అది కాదు, ప్రొఫెసర్, నే చెప్పేది. మనం తాగిన కాఫీ. . .

సు: ఆగు, ప్రేమా, చెప్పకు. మిస్టర్ రవీ! మల్టీ మిలియనర్ జగన్నాధం కొడుకుతో నాటకం ఆడగలిగే మీ ధైర్యానికి మెచ్చుకొంటున్నాను. కానీ, ఈ సుధాకరం తలుచుకొంటే. . .




భీ: అక్కడే ఆగు, సుధాకరం, ఇంకో అడుగు ముందుకేస్తే ఈ వర్షంలో నిన్ను హాస్పిటల్‌కి తీసుకెళ్ళే వాళ్ళెవరూ ఉండరు.

సు: అంటే. . .

భీ: ఉట్టి మాటలతో చెపితే అర్థం కాలేదా? నువ్విలా కూర్చో. ఎక్సైట్ అవకు.

ప్రే: కానీ, రాజుగారూ, నన్నొక విషయం చెప్పనివ్వండి.

భీ: ప్రేమా! నీ స్నేహితుడిమీద నీకు అభిమానం ఉంటే ఉండచ్చు. కానీ, అతని ప్రవర్తన. . .

ప్రే: ఆ విషయం కాదు. నే చెప్పబోయే. . .

భీ: అదికాకపోతే ఫరవాలేదు. . . ప్రొఫెసర్! (ఆగి) నేను జీవితంలో ఎవర్నీ ప్రేమించలేదు—నాచెల్లెల్నితప్ప. నాకు ప్రేమంటే ఏమిటో తెలియదుకూడా. కానీ, ఈ కొద్ది సేపట్లో అర్థమయింది—ప్రేమ పేరుని మనుషు లెంత నికృష్టంగా ఉపయోగించుకొంటున్నారో. . . కట్టుకొన్న భార్యని కాదని, ఎవరో సుజాతని తెచ్చుకొందామని వెళ్ళి, మధ్య దారిలో కనబడిన ఇంకో అమ్మాయిని తీసుకొచ్చిన సుధాకరం ప్రేమకి ఒక రంగు పూస్తే. . .

ర: అతడికి పిల్లలు పుట్టరేమో అన్న భయంతో నిమిషాలమీద అతని మీది ప్రేమనంతా నా వైపుకి తిప్పేసిన ఈ అమ్మాయి ప్రేమ ఇంకో రంగు.

భీ: (సినికల్‌గా) కానీ, నా చెల్లెలిలాటివాళ్ళే, ప్రొఫెసర్, ప్రతీ చిన్న అనుభవానికీ, అనుబంధానికి ప్రేమ అనే రంగు పూస్తున్న బ్రహ్మానందం లాటి వాళ్ళ చేతిలో బలి అయిపోతున్నారు.

ప్రే: నే చెప్పబోయేది ఎవరూ వినిపించుకోరేం— ఒక నిమిషం వినండి.

భీ: ఇంకేముంది వినటానికి— మీ రక్తంలో జీర్ణించుకుపోయిన భావాలు ఇటువంటి అనుభవాల వల్ల మారవుగా? నీ బోయ్ ఫ్రెండ్‌ని తీసుకొని వెళ్ళిపో. . . అరే, అదేమిటి?

సు: (రివాల్వర్ చూపిస్తూ) అక్కడే ఆగు, భీమరాజా, కదలకు. మీ రాడిన నాటకానికి ముగింపు నేను చెప్తాను. . . ప్రొఫెసర్! నన్ను ఫూల్ని చేసి పది ఆస్పిరిన్ టాబ్లెట్లు వేసుకొనేటట్టు చేసినందుకు పొంగి పోకండి. మీ రేదో ఎక్స్‌పెరిమెంట్ కోసం ఆడిన నాటకం మీ జీవితానికి చరమాంకం పలుకుతోంది వినండి. ప్రొఫెసర్! జాగ్రత్తగా వినండి. నాతో పాటూ మీరు తాగిన కాఫీలో— నేను మెడికల్ షాపునుంచి పట్టుకొచ్చిన విషం కలుపబడింది.

భీ: }
ర: } సుధాకర్. . .

సు: నువ్వు మాట్లాడకు, భీమరాజా, అక్కడే నిలబడు. కదలకు. (తిరిగి) ఏం, ప్రొఫెసర్, జీవితమంటే అంత తీపెందుకు? రెండు నిమిషాలు ఓపిక పట్టండి. మాకు గుడ్‌బై చెబుదురుగాని.

ప్రే: సుధాకర్! అసలు. . .

సు: ఈ విషయంలో నువ్వేమీ కలుగచేసుకోకు, ప్రేమా! ఈయన మీద నాకు శత్రుత్వమేమీ లేదు. జరిగిందంతా కాకతాళీయం. ఇందులో నా తప్పేమీ లేదు. . . భయపడకండి, ప్రొఫెసర్, ఇంకో రెండు నిమిషాల్లో స్పృహ తప్పుతుంది. ఆ పైన అర గంటలో ప్రాణం పోతుంది. అంతే. . .

భీ: అదేగాని జరిగితే నిన్నీ భీమరాజు ప్రాణాలతో వదలడు, సుధాకర్! ఎలాగైనా నీ మీద పగ సాధించి తీరుతాడు.

సు: (నవ్వి) అంటే ఇంకా బ్రతుకుదామనేనా నీ ఆశ, భీమరాజా! ఈ ప్రొఫెసర్ చచ్చిపోతే దానికి సాక్షివి నువ్వే. . . జరిగిన ప్రమాదం ఎలానూ జరిగిపోయింది. ఆగండి, ప్రొఫెసర్, అడుగు ముందు కెయ్యకండి—నా గురి తప్పదు. భీమరాజా! నువ్వు బ్రతికుంటే నీ తోనూ, నువ్విచ్చే సాక్ష్యంతో పోలీసులతోనూ ఎలాగైనా ప్రమాదమే. జరిగిన ప్రమాదం ఎలానూ జరిగిపోయింది. నీ అడ్డుకూడా తొలగించుకొంటే నాకొచ్చే నష్టం ఏమీలేదు. పైగా గవర్నమెంట్ నది పేలిస్తుంది కూడా. వరసగా మూడు లెక్క పెడతాను. దేవుణ్ణి ప్రార్థించు. ఒక. . . టి. .. రెం. . . డు. . . మూ. . . (కడుపు పట్టుకొని ముందుకు వాలిపోయాడు.) ఏ. . . మిటి. .. ది. . .

ప్రే: నే చెప్పేది అసలు వినిపించుకోరేం, సుధా? ఆ విషం ఉన్న కాఫీ నువ్వే తాగావు.

సు: (రివాల్వర్ వదిలేసి) ఏమిటి?

ప్రే: ఈ ప్రళయం, ఇదంతా నాటకమని నాకు తెలియదు. అంతా నిజమే అనుకొన్నాను. అందుకే. . . అందుకే. . . కాఫీ కప్పులు .నే. . నే. . . మార్చాను.

సు: ఎందుకు?

ర: ఇంత చిన్న విషయం అర్థం కావటం లేదా, సుధాకరం? మనం ముగ్గురమే బ్రతికే పక్షంలో— పిల్లలు పుట్టటానికి అవకాశం లేని నిన్ను బ్రతికించుకోవటానికన్నా, నాతో కలిసి కొత్త ప్రపంచం సృష్టించటమే మంచిదనుకొంది ప్రేమ. అంతే. . .

సు: రాక్షసీ.. (పడిపోతూ ఉంటే ప్రేమ పట్టుకొంది.)

ర: కాదు— స్త్రీ.

ప్రే: సుధా! ఆలస్యం చేస్తే ప్రమాదం. వెళదాం పద. తొందరగా హాస్పిటల్‌లో చేర్చాలి నిన్ను. (ఇద్దరూ వెళుతూ ఉండగా...)

ర: చూడు, సుధాకరం, ఈ ప్రశ్నకి జవాబు చెప్పి వెళ్ళు. . . నీ గర్ల్ ఫ్రెండ్ని ఎక్కడ ప్రేమిస్తుందో అన్న భయంతో నన్ను చంపాలని చూశావుకదా? నా భార్యని నువ్వు ప్రేమించిన నేరానికి నిన్నెన్నిసార్లు చంపాలి నేను? (ఇద్దరూ వెళ్ళిపోయారు.)

ర: (శుష్కంగా నవ్వి) రకరకాల రంగులు. అన్నిటి నీడా నలుపే.

భీ: అవును, రవిబాబూ, ప్రేమకి ఈ ప్రపంచంలో విలువ లేకుండా పోతోంది.

ర: అలా అనకు, రాజా, ప్రేమకి నిజమైన అర్థం చూపించటానికి కమల లాటి వాళ్ళు ఎప్పుడూ ఉంటారు.

భీ: (కంబళి తీసుకొని) వెళతాను, ప్రొఫెసర్, వర్షం పూర్తిగా వెలిసిపోయింది. (ఆగి) బ్రహ్మానందం కోసం నే నిక వెతకను, ప్రొఫెసర్! ఎందుకంటే ప్రతి మనిషిలోనూ దాదాపు అతనున్నాడు కాబట్టీ. . . అతను చావడు కాబట్టీ!

(తెర)

(సమాప్తం)